# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 38 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 25-08-2026 | పేజీలు: 10







## సిరా చుక్క

రక్తంతో రాసే ఆపరేషన్
థియేటర్లలో ప్రాణాన్ని గెలిపించే
తెల్లటి సంతకం... వైద్యుడు!
అలసట ఎరుగని హృదయ స్పందనల మధ్య
చావును జయించే ప్రతి శ్వాస వెనుక
ఓ నిశ్శబ్ద త్యాగం దాగి ఉంది.
బాధల చీకటిలో నలిగే రోగికి
ఆయన ఒక ఆశల వెలుగు;
కన్నీటి మధ్య చిగురించే
నూతన ఆయువుకు జీవధార.
స్వార్థం లేని సేవకు చిరునామాగా
మహమ్మారుల యమపాశాలను తెంచే
మానవత్వపు కవచం ఆయన.
ఆ చేతుల్లో అమృతం ఉందో లేదో గానీ
ఆ చూపుల్లో నింపే ధైర్యమే
సగం ప్రాణాన్ని నిలబెడుతుంది.
అలాంటి ప్రాణదాత ప్రాణాలకే రక్షణ కరువై
ఆయన ఆత్మగౌరవం గాయపడితే...
అది సమాజపు విచక్షణకే మచ్చ!
వైద్యుని గౌరవించడం అంటే
మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవడమే.
వైద్యం ఒక వ్యాపారం కాదు...
అది మానవత్వాన్ని బతికించే పవిత్ర యజ్ఞం!

– డాక్టర్ సప్తఋషి ..,
పిల్లల వైద్య నిపుణులు హుస్నాబాద్



# కొండా సురేఖపై చర్యలుంటాయా?
# రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు!

- కొండా సురేఖ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- పార్టీ అంతర్గత విషయాలపై తాను మాట్లాడనని స్పష్టత.
- క్రమశిక్షణ కమిటీ, పీసీసీ, ఏఐసీసీ నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని వ్యాఖ్య
- కొండా సురేఖ, సుస్మిత వ్యాఖ్యలపై పార్టీలో కొనసాగుతున్న చర్చ
- సురేఖపై చర్యల విషయంలో అధిష్ఠానం నిర్ణయమే కీలకం కానుందా?



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండా సురేఖ వ్యవహారంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సచివాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో తన అమెరికా పర్యటన రద్దు అంశంపైనే ప్రధానంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డిని మీడియా కొండా సురేఖ వ్యవహారంపై ప్రశ్నించింది. దీనికి స్పందించిన సీఎం.. పార్టీ అంతర్గత విషయాలపై తాను చర్చించబోనని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ, పీసీసీ, ఏఐసీసీ ఈ అంశాన్ని పరిశీలిస్తాయని తెలిపారు.

### పార్టీ నిర్ణయాలకు అందరూ కట్టుబడాల్సిందే

కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. పార్టీ అంతర్గత అంశాలను తాను చర్చించనని, క్రమశిక్షణ కమిటీ, పీసీసీ, ఏఐసీసీ ఈ విషయాలను పరిశీలిస్తాయని చెప్పారు. ఆయా సంస్థలు తీసుకున్న నిర్ణయాలకు పార్టీలోని ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.

### అధిష్ఠానం పరిశీలనలో సురేఖ వ్యవహారం

కొండా సురేఖ వ్యవహారంపై ఇప్పటికే ఏఐసీసీ రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకున్నట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరుల అభిప్రాయాలను కూడా అధిష్ఠానం సేకరించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పార్టీ అంతర్గతంగా విచారణ జరుగుతున్న నేపథ్యంలో త్వరలో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

### మంత్రి పదవి నుంచి తొలగించాలంటూ డిమాండ్లు

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సుస్మిత చేసిన వ్యాఖ్యలు, అనంతరం కొండా కుటుంబం వ్యవహరించిన తీరుపై పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు సమాచారం. పార్టీకి నష్టం జరగకుండా అధిష్ఠానం అన్ని పరిణామాలను పరిశీలించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మిగతా 2లో

# కొండా కుటుంబం చూపు జనసేన వైపు?

- సుస్మిత కీలక భేటీకి రంగం సిద్ధం!
- కొండా సురేఖపై కాంగ్రెస్‌లో అసమ్మతి
- మంత్రి పదవి నుంచి తొలగించాలంటూ ఎమ్మెల్యేల డిమాండ్
- సురేఖ వ్యవహారంపై పీసీసీ నివేదిక
- ఏఐసీసీ నిర్ణయం కోసం ఎదురుచూపులు
- జనసేన కీలక నేతలతో సుస్మిత భేటీ కానున్నట్లు సమాచారం
- పరకాల అసెంబ్లీ టికెట్, ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ పగ్గాలపై చర్చించే అవకాశం
- కాంగ్రెస్‌లో పరిణామాలు ప్రతికూలంగా మారితే జనసేనలోకి వెళ్లే యోచనలో కొండా కుటుంబం?



జనసేన పార్టీ

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంలో కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ కావడం, తన కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని ఆమె వివరణ ఇవ్వడం, తనపై కుట్ర జరుగుతోందంటూ పార్టీకి లేఖ రాయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో సురేఖపై అసమ్మతి వర్గం గళం విప్పింది. దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు మీడియా సమావేశం నిర్వహించి ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేయడం మరింత కలకలం రేపింది.

### ఏఐసీసీ నిర్ణయం కోసం ఎదురుచూపులు

కొండా సురేఖ వ్యవహారంపై

మిగతా 2లో

# తల్లిదండ్రులను చంపిన నర్సు సురేఖ ఆత్మహత్య.. సంగారెడ్డిలో విషాదం!

- ప్రియుడిని పెళ్లి చేసుకునేందుకు తల్లిదండ్రులను హతమార్చిన నర్సు సురేఖ
- మత్తు ఇంజక్షన్ల అధిక మోతాదు ఇచ్చి తల్లిదండ్రులను చంపినట్లు పోలీసుల గుర్తింపు
- హత్య కేసులో జైలుకు వెళ్లి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చిన సురేఖ
- సంగారెడ్డి ప్రైవేట్ హాస్టల్‌లో మత్తు ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్య
- ఆత్మహత్యకు కారణాలపై పోలీసుల దర్యాప్తు
- మార్చురీలో భద్రపరిచిన మృతదేహం



2 లో

# దివ్యాంగ వధువులకు ఊరట
# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే సవరణ!

- దివ్యాంగ వధువులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధుల విడుదలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- దివ్యాంగ లబ్ధిదారులకు గతంలో విధించిన స్టేను తాజాగా తొలగించిన హైకోర్టు
- దివ్యాంగులు మినహా సాధారణ లబ్ధిదారులకు నిధుల విడుదలపై స్టే యథాతథం
- 2014 నుంచి అమలవుతున్న పథకాల కోసం జారీ చేసిన ఎనిమిది జీవోలపైనా గతంలో స్టే
- ప్రజాధనం వినియోగం, ఉచిత పథకాలపై ప్రభుత్వ తీరును ప్రశ్నించిన హైకోర్టు




**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై గతంలో విధించిన మధ్యంతర స్టేను సవరించింది. దివ్యాంగ వధువులకు అందించే ఆర్థిక సాయంపై విధించిన స్టేను తాజాగా తొలగించింది. దీంతో అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు నిధుల విడుదల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది.

### దివ్యాంగ వధువులకు ఊరట

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న దివ్యాంగ వధువులకు హైకోర్టు తాజా నిర్ణయం ఊరటనిచ్చింది. దివ్యాంగ వధువులకు సంబంధించిన నిధుల విడుదలపై గతంలో విధించిన స్టేను తొలగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ

మిగతా 2లో

# 92.87 లక్షల మంది ఓటర్లకు నేటి నుంచి నోటీసులు

- వివరణ ఇవ్వకుంటే ఓటు తొలగింపు?
- అనామలీస్, అన్-మ్యాపింగ్ విభాగాల్లో ఉన్న 92.87 లక్షల మంది ఓటర్లకు నోటీసులు
- 60.51 లక్షల మంది అనామలీస్, 32.36 లక్షల మంది అన్-మ్యాపింగ్ జాబితాలో గుర్తింపు
- బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నేటి నుంచి నోటీసులు అందజేత
- నిర్ణీత గడువులోగా వివరణ, అవసరమైన పత్రాలు సమర్పించాలని ఎన్నికల అధికారులు సూచన.
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఎక్కువ నోటీసులు.

2 లో

# తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణం

- రాజగోపాల్ రెడ్డి కేంద్రంగా వైస్సార్సీపీ కొత్త వ్యూహమా?
- మునుగోడు ఎమ్మెల్యే రాజకీయ అడుగులపై మళ్లీ ఆసక్తికర చర్చ
- వైఎస్సార్ అభిమానులు, జగన్ మద్దతుదారులు, రాజగోపాల్ వర్గాల ఐక్యతపై ప్రచారం
- తెలంగాణలో బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఏర్పాటుపై ఊహాగానాలు
- కొత్త వేదికకు రాజగోపాల్ రెడ్డి నాయకత్వం వహిస్తారా?
- సీఎం రేసుపై చర్చ
- అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ సమీకరణాలపైనా ప్రభావం చూపే అవకాశమా?



**ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్.** రాజగోపాల్ అడుగులపై రాజకీయ ఉత్కంఠ.తెలంగాణ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తికర చర్చ సాగుతోంది. ఆయన చుట్టూ కొత్త రాజకీయ సమీకరణం ఏర్పడే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి.

### వైస్సార్సీపీ తో కొత్త అనుబంధానికి సంకేతాలా?

తెలంగాణలో వైఎస్సార్ అభిమానులను తిరిగి ఒకే రాజకీయ వేదికపైకి తీసుకురావాలనే ప్రయత్నాల్లో భాగంగా వైస్సార్సీపీ కొత్త వ్యూహాలకు తెరతీసే అవకాశముందనే ప్రచారం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి పేరు కీలకంగా తెరపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### మూడు వర్గాల కలయికే అసలు రాజకీయ లెక్క?

వైఎస్సార్ సంక్షేమ పాలనను అభిమానించే వర్గాలు, వైఎస్ జగన్ మద్దతుదారులు, రాజగోపాల్ రెడ్డి సొంత రాజకీయ బలగం ఒకే వేదికపైకి వస్తే తెలంగాణలో కొత్త రాజకీయ శక్తి ఏర్పడే అవకాశముందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### నాయకత్వ పగ్గాలు రాజగోపాల్ చేతికేనా?

తెలంగాణలో కొత్త రాజకీయ వేదిక రూపుదిద్దుకుంటే దానికి రాజగోపాల్ రెడ్డి నాయకత్వం వహిస్తారా? అనే చర్చ కూడా మొదలైంది. భవిష్యత్తు ఎన్నికల్లో ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేసే వ్యూహం ఉండవచ్చనే ప్రచారం రాజకీయంగా మరింత ఆసక్తిని పెంచుతోంది.

### కాంగ్రెస్‌కు కొత్త సవాల్‌గా మారుతుందా?

కాంగ్రెస్‌లో అసంతృప్తితో ఉన్న నేతలు, పాత వైఎస్సార్ అభిమానులు, ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కోసం ఎదురుచూస్తున్న

మిగతా 2లో

# ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై సీజేపీ ఫోకస్..

- విద్యాశాఖ మంత్రులకు అభిజీత్ దీప్కే బహిరంగ లేఖ!
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆందోళన
- అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు పాఠశాలల పరిస్థితిపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్.
- ఉపాధ్యాయ ఖాళీలు, నిధుల వినియోగం, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ విద్యపై వివరాలు కోరిన సీజేపీ.
- 'స్కూల్ లీక్ కరో' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై దేశవ్యాప్త ప్రచారం

2 లో

# 92.87 లక్షల మంది ఓటర్లకు నేటి నుంచి నోటీసులు



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా తెలంగాణలో ఓటర్ల వివరాల పరిశీలనకు ఎన్నికల సంఘం మరో కీలక ప్రక్రియ చేపట్టింది. 'అనామలీస్, అన్-మ్యాపింగ్' విభాగాల కింద గుర్తించిన ఓటర్లకు నేటి నుంచి దశల వారీగా నోటీసులు జారీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 92.87 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందనున్నాయి. ఇందులో 60.51 లక్షల మంది 'అనామలీస్' విభాగంలో ఉండగా.. మరో 32.36 లక్షల మంది 'అన్-మ్యాపింగ్' కేటగిరీలో ఉన్నారు.

### ఇంటింటికీ వెళ్లనున్న బీఎల్ఓలు

ఈ నెల 17న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైనప్పటికీ.. మరుసటి రోజు నుంచి ప్రారంభం కావాల్సిన నోటీసుల పంపిణీ వివిధ కారణాలతో వాయిదా పడింది. తాజాగా సోమవారం నుంచి బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందజేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో రోజుకు 200 మంది ఓటర్లకు వివరణ ఇచ్చేందుకు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### వివరణ ఇవ్వకపోతే ఓటు తొలగింపు?

నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా తమ వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటు వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. వివరణ ఇవ్వకపోతే ఓటు తొలగించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నోటీసుల పంపిణీకి ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసిన అధికారులు.. ఓటరుకు నోటీసు అందించిన ఫొటోను బీఎల్ఓలు యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

### హైదరాబాద్‌లో ఎక్కువగా అనామలీస్, అన్-మ్యాపింగ్ ఓట్లు

ఓటర్ల ఇంటిపేరు, పేర్లలో తప్పులు ఉన్న ఓట్లు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సమస్య ఓల్డ్ సిటీ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లకు నోటీసులు అందనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్-మ్యాపింగ్ ఓట్లు కూడా ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

### అర్హులైన ఓటర్లను తొలగించబోం

నోటీసులు అందుకున్నంత మాత్రాన ఓటు తొలగిపోతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత తేదీల్లో అవసరమైన పత్రాలు, వివరణ సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లోని 11 రకాల కార్డుల్లో ఏదైనా ఒకటి చూపిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని అధికారులు భరోసా ఇచ్చారు. నోటీసు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఓటర్లు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు.

# 22ఏ భూములపై ఆందోళన వద్దు.. 24 గంటల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- **22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్న మంత్రి పొంగులేటి**
- **నిజమైన సమస్యలను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని హామీ**
- **కొన్ని 22ఏ రిజిస్ట్రేషన్ కేసులను 24 గంటల్లోనే క్లియర్ చేస్తున్నట్లు వెల్లడి**
- **టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్**
- **రిపీట్ కాల్స్ తొలగిస్తే 980 ఫిర్యాదులు**
- **నకిలీ జీవోలు, మెమోలతో రిజిస్ట్రేషన్లకు ఒత్తిడి చేస్తే కేసులు పెడతామని హెచ్చరిక**



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. 22ఏ భూముల అంశంపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిజమైన భూ సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన కేసులను వేగంగా పరిష్కరిస్తున్నామని.. కొన్ని కేసులను 24 గంటల్లోనే క్లియర్ చేస్తున్నామని తెలిపారు.

### 24 గంటల్లోనే కేసుల పరిష్కారం

ఇప్పటికే రిలాక్సేషన్ వచ్చిన కేసులను క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన వాటిలో నిజమైన సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఒకట్రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటినీ పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. 22ఏ జాబితాలో ఉన్న భూములు, ప్రభుత్వ ఉత్తర్వులు, రిలాక్సేషన్ ఇచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

### టోల్‌ఫ్రీకి 1,162 కాల్స్

22ఏ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఈ నెల 18 నుంచి ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చినట్లు పొంగులేటి తెలిపారు. రిపీట్ కాల్స్‌ను తొలగిస్తే 980 ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. ఇందులో 547 వ్యవసాయ సంబంధిత సమస్యలు కాగా.. 433 వ్యవసాయేతర అంశాలకు సంబంధించినవని వివరించారు. ఫిర్యాదులను జిల్లాల వారీగా అధికారులకు పంపించి పరిష్కరిస్తున్నామని తెలిపారు.

### నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేస్తే చర్యలు

22ఏ అంశంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను భయపెడుతున్నాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు. గతంలో రిలాక్సేషన్ వచ్చిన నిజమైన కేసుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయలేని భూములను మాత్రం రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొందరు నకిలీ జీవోలు, మెమోలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించిన మంత్రి.. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### ప్రైవేట్ భూములు కూడా జాబితాలోకి రావడంతో సమస్యలు

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్, భూదాన్ భూములతో పాటు కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అవకాశం ఉంది. అయితే జాబితా నవీకరణ సమయంలో ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేట్ పట్టా భూములు ఉన్న సందర్భాల్లో మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడంతో సమస్యలు తలెత్తినట్లు ప్రభుత్వం చెబుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పలువురు ఆస్తి యజమానులు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలపై ప్రతి సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.

# కొండా సురేఖపై చర్యలుంటాయా?

## రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు!

మొదటి పేజీ తరువాయి

### పార్టీ వ్యవస్థలకే బాధ్యత అప్పగించిన సీఎం

కొండా సురేఖ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకుండా పార్టీ అధికారిక వ్యవస్థలకే బాధ్యతను అప్పగించారు. పీసీసీ ఇప్పటికే అధిష్ఠానానికి నివేదిక పంపినట్లు సమాచారం. అంతర్గత వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనని సీఎం స్పష్టం చేయడం ద్వారా పార్టీ క్రమశిక్షణ ప్రక్రియను గౌరవిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇప్పుడు ఏఐసీసీ, పీసీసీ, క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయంపైనే కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# కొండా కుటుంబం చూపు జనసేన వైపు?

మొదటి పేజీ తరువాయి

పీసీసీ ఇప్పటికే నివేదికను ఏఐసీసీకి పంపినట్లు సమాచారం. ఈ అంశంపై అధిష్ఠానం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఒకవేళ పార్టీ చర్యలు తీసుకుంటే తదుపరి రాజకీయ అడుగులపై కొండా కుటుంబం ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### జనసేన నేతలతో సుస్మిత భేటీ?

ఈ నేపథ్యంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత జనసేన వైపు చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా జనసేన పార్టీకి చెందిన కీలక నేతలతో ఆమె భేటీ కానున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ నేత నివాసంలో జరిగే ఈ సమావేశంలో పరకాల అసెంబ్లీ టికెట్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ బాధ్యతలపై చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

### పరకాల టికెట్‌పై ఆశలు

పరకాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలన్న ఆసక్తిని సుస్మిత గతంలోనే వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్‌లో తల్లి మంత్రి పదవిలో ఉన్నప్పటికీ.. టికెట్ విషయంలో భవిష్యత్తు ఎలా ఉంటుందన్న అనిశ్చితితో ప్రత్యామ్నాయ రాజకీయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనసేనలో చేరితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతలు కూడా చేపట్టాలని సుస్మిత భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### పవన్ కల్యాణ్ ప్రభావం ఉంటుందా?

ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ వరంగల్ పర్యటన, తెలంగాణలోనూ ఎన్నికల బరిలో నిలుస్తామని ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీపై ఆసక్తిని పెంచుతున్నాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ ప్రాంతంలో పవన్ కల్యాణ్‌కు ఉన్న అభిమానగణం, జనసేనలో చేరేందుకు పలువురు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో కొండా కుటుంబం కూడా ఆ పార్టీ వైపు దృష్టి సారించినట్లు ప్రచారం సాగుతోంది. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం కొండా సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపైనే కుటుంబం తదుపరి రాజకీయ అడుగు ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది.

# తల్లిదండ్రులను చంపిన నర్సు సురేఖ ఆత్మహత్య.. సంగారెడ్డిలో విషాదం!

**సంగారెడ్డి, ప్రజా వాయిస్:** ప్రియుడి మోజులో పడి కన్న తల్లిదండ్రులను అత్యంత పాశవికంగా హతమార్చిన వికారాబాద్ జిల్లాకు చెందిన నర్సు సురేఖ కేసు అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. తల్లిదండ్రులు తన ప్రేమ, పెళ్లికి అడ్డుగా ఉన్నారని భావించిన సురేఖ.. వారికి మత్తు ఇంజక్షన్లు ఇచ్చి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన ఆమె సంగారెడ్డిలో ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర విషాదాన్ని నింపింది.

### తల్లిదండ్రులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి హత్య

సుమారు ఆరు నెలల క్రితం సురేఖ ఓ వ్యక్తిని ప్రేమించి అతడిని పెళ్లి చేసుకోవాలని భావించింది. అయితే తన పెళ్లికి తల్లిదండ్రులు అడ్డుగా ఉన్నారని భావించి వారిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒళ్లు నొప్పులకు మందు ఇస్తున్నానని చెప్పి తల్లిదండ్రులకు అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్లు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సురేఖను అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

### బెయిల్‌పై బయటకు వచ్చి హాస్టల్‌లో ఆత్మహత్య

తల్లిదండ్రుల హత్య కేసులో జైలుకు వెళ్లిన సురేఖకు ఇటీవల బెయిల్ మంజూరైంది. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. తాజాగా అదే హాస్టల్‌లో మత్తు ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. హాస్టల్‌లో ఆమె మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

### మార్చురీలో మృతదేహం భద్రపరిచిన పోలీసులు

సంగారెడ్డి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించినప్పటికీ.. సురేఖ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులు ఎవరూ రాలేదని సమాచారం. దీంతో ఆమె మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

### ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు

జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సురేఖ మానసిక పరిస్థితి ఎలా ఉంది? ఆత్మహత్యకు అసలు కారణాలు ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులను మత్తు ఇంజక్షన్లతో హతమార్చిన సురేఖ.. అదే విధానంలో తన జీవితాన్ని కూడా ముగించుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణం

మొదటి పేజీ తరువాయి

వర్గాలు ఈ కొత్త సమీకరణ వైపు మొగ్గుచూపితే అధికార కాంగ్రెస్‌కు కొత్త రాజకీయ సవాల్ తప్పదనే అంచనాలు ఉన్నాయి.

### తెలంగాణ రాజకీయాల్లో మారనున్న లెక్కలు?

ఈ ప్రచారం నిజంగా కార్యరూపం దాల్చితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య కొనసాగుతున్న రాజకీయ పోరులో మరో బలమైన శక్తి చేరే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం రాజగోపాల్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు, YSRCPతో ఆయన అనుబంధంపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

### ప్రచారం నిజమైతే సంచలనమే..

వైఎస్సార్ సంక్షేమ వారసత్వం.. జగన్ మద్దతు.. రాజగోపాల్ రెడ్డి మాస్ నాయకత్వం ఒకే రాజకీయ వేదికపై కలిస్తే తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉందనే చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై సీజేపీ ఫోకస్



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో సీజేపీ వ్యవస్థాపకుడు, కన్వీనర్ అభిజీత్ దీప్కే అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ, ఉపాధ్యాయుల ఖాళీలు, నిధుల వినియోగం, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ విద్య, క్రీడా సౌకర్యాలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

### ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు ప్రాధాన్యం

ప్రాథమిక విద్య రాజకీయ అంశం కాదని.. ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కు అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసర ప్రాధాన్యతగా పరిగణించాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నా అనేక పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు, సురక్షిత తాగునీరు, తరగతి గదులు, బెంచీలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడం ఆందోళనకరమని అన్నారు.

### నిధులు, ఉపాధ్యాయ ఖాళీలపై వివరాలు ఇవ్వాలి

గత ఐదేళ్లలో రాష్ట్రాల పరిధిలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించారో వెల్లడించాలని అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. తక్షణ మరమ్మతులు, పూర్తిస్థాయి పునరుద్ధరణ అవసరమైన పాఠశాలల సంఖ్యను కూడా బహిర్గతం చేయాలని కోరారు. పాఠశాలలకు కేటాయించిన నిధులు, క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తం వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు, పనిచేస్తున్న టీచర్లు, ఖాళీల వివరాలను వెల్లడించాలని కోరారు.

### మౌలిక వసతులపై శ్వేతపత్రం కావాలి

ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగంలో ఉన్న మరుగుదొడ్లు, సురక్షిత తాగునీటి సౌకర్యాలు, డిజిటల్ లేదా కంప్యూటర్ లెర్నింగ్ సదుపాయాలు, ఆటస్థలాలు, క్రీడా పరికరాలు ఉన్న పాఠశాలల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వాలు వెల్లడించాలని సీజేపీ కోరింది. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించే పరిస్థితిని తగ్గించి.. వారు తరగతి గదుల్లో బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని అభిజీత్ దీప్కే సూచించారు.

### 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడానికి సీజేపీ దేశవ్యాప్తంగా 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆగస్టు 15న మహారాష్ట్రలోని హింగోలి జిల్లా సంతుక్ పింప్రి గ్రామం నుంచి ఈ ప్రచారం ప్రారంభమైనట్లు పార్టీ తెలిపింది. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, గ్రామ సర్పంచ్‌లు భాగస్వాములై పాఠశాలల్లో మౌలిక వసతులపై సామాజిక ఆడిట్ నిర్వహించాలని సీజేపీ పిలుపునిచ్చింది. సమస్యలను గుర్తించి అధికారులను జవాబుదారీగా చేయడంతో పాటు స్థానికంగా పరిష్కారాల కోసం ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అభిజీత్ దీప్కే తెలిపారు.

# దివ్యాంగ వధువులకు ఊరట

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే సవరణ!

మొదటి పేజీ తరువాయి

చేసింది. దీంతో అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే మార్గం సుగమమైంది.

### మిగిలిన లబ్ధిదారులకు స్టే కొనసాగింపు

అయితే దివ్యాంగులు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాధారణ లబ్ధిదారులకు మాత్రం నిధుల విడుదలపై విధించిన స్టే యథాతథంగా కొనసాగుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సాధారణ లబ్ధిదారులకు చెల్లింపులు నిలిచిపోనున్నాయి.

### 2014 నుంచి అమలవుతున్న పథకాలపై స్టే

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 2014 నుంచి తెలంగాణలో అమలవుతున్నాయి. ఈ పథకాల అమలుకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల అమలుపైనా హైకోర్టు గతంలో మధ్యంతర స్టే విధించింది. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి చెల్లింపులు చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది.

### ప్రజాధనం వినియోగంపై హైకోర్టు ప్రశ్నలు

నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని గతంలో న్యాయస్థానం తిరస్కరించింది. రాష్ట్రంలో ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వృద్ధులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో అందని పరిస్థితుల్లో ఉచిత పథకాల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని హైకోర్టు ప్రశ్నించింది. కష్టపడి పనిచేసే ప్రజలు చెల్లించే పన్నుల సొమ్మును ఉచిత పథకాలకు మళ్లించడం న్యాయమేనా అంటూ నిలదీసింది.

### శాసనసభ ఆమోదం లేని పథకాలపై ఆగ్రహం

శాసనసభ ఆమోదం లేని ఇటువంటి ఉచిత పథకాలకు వందల కోట్ల రూపాయలను ఎలా కేటాయిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ప్రజాధనం వినియోగంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది. తాజా ఆదేశాలతో దివ్యాంగ వధువులకు నిధుల విడుదలకు మార్గం ఏర్పడగా.. మిగిలిన లబ్ధిదారులకు స్టే కొనసాగడం ప్రాధాన్యం సంతరించుకుంది.




# రామగుండంలో ఎన్ఐఏ సోదాలు

- **ఉగ్ర లింకుల అనుమానంతో ఇంజినీరింగ్ విద్యార్థి అదుపులోకి!**
- **పెద్దపల్లి జిల్లా రామగుండంలోని అయోధ్యనగర్‌లో ఎన్ఐఏ అధికారుల తనిఖీలు**
- **ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్ అదుపులోకి**
- **ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్‌కు తరలించి విద్యార్థిని ప్రశ్నిస్తున్న ఎన్ఐఏ అధికారులు**
- **2023లో గోదావరిఖనిలోనూ ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ**
- **ఇటీవల ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో ఏకకాల సోదాలు**
- **12 మంది అరెస్ట్.**

**పెద్దపల్లి, ప్రజా వాయిస్:** తెలంగాణలో మరోసారి ఉగ్ర లింకుల కలకలం రేగింది. పెద్దపల్లి జిల్లా రామగుండంలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. రామగుండంలోని అయోధ్య నగర్‌లో సోదాలు చేపట్టిన అధికారులు.. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతడిని ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

### ఉగ్ర లింకులపై ఆరా

ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? ఎవరితో సంప్రదింపులు జరిపాడు? ఆన్‌లైన్‌లో ఉగ్రవాద భావజాలానికి సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొన్నాడా? అనే కోణాల్లో ఎన్ఐఏ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థి నుంచి లభించిన సమాచారం, ఇతర ఆధారాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

### 2023లో గోదావరిఖనిలోనూ సోదాలు

పెద్దపల్లి జిల్లాలో ఉగ్ర లింకుల అనుమానంతో ఎన్ఐఏ సోదాలు నిర్వహించడం ఇదే తొలిసారి కాదు. 2023లో గోదావరిఖనిలో అధికారులు తనిఖీలు చేపట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారికి ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్‌తో సంబంధాలు ఉన్నట్లు అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు దర్యాప్తు చేపట్టారు.

### ఇటీవల దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించి ఎన్ఐఏ ఇటీవల విస్తృతంగా సోదాలు నిర్వహిస్తోంది. సుమారు నెల రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక సహా పలు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. భారత్‌లో ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు దిశగా కుట్ర జరుగుతోందన్న అనుమానాలు, ఆన్‌లైన్‌లో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం, హింసాత్మక చర్యల ద్వారా ప్రభుత్వాన్ని కూలదోయేందుకు కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో 12 మందిని అరెస్ట్ చేసినట్లు సమాచారం.

### హైదరాబాద్, బళ్లారిలోనూ నెట్‌వర్క్‌పై దర్యాప్తు

గతంలో విజయవాడకు చెందిన రహ్మతుల్లా షరీఫ్‌ను ఎన్ఐఏ అదుపులోకి తీసుకుని విచారించిన సమయంలో ఉగ్ర నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు కర్ణాటకలోని బళ్లారిలోనూ ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మూలాలు ఉన్నట్లు అప్పట్లో దర్యాప్తులో వెల్లడైంది. తాజాగా రామగుండంలో ఇంజినీరింగ్ విద్యార్థి అదుపులోకి రావడంతో ఉగ్ర లింకులపై ఎన్ఐఏ దర్యాప్తు మరోసారి చర్చనీయాంశంగా మారింది.



# రైలు కదిలితేనే కోదాడ కు కళ

- హైదరాబాద్,అమరావతి,చెన్నై అలైన్‌మెంట్ మార్చొద్దు
- సూర్యాపేట,కోదాడ మీదుగా రైలుమార్గం కొనసాగించాలి
- భవిష్యత్ తరాల కోసమే ఈ పోరాటం
- అఖిలపక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**ప్రజా వాయిస్,కోదాడ:** హైదరాబాద్, అమరావతి,చెన్నై నగరాలను అనుసంధానించే ప్రతిపాదిత హైస్పీడ్ బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను మార్చకుండా సూర్యాపేట,కోదాడ మీదుగా రైలుమార్గాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కోదాడ పబ్లిక్ క్లబ్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అన్ని వర్గాల ప్రతినిధులు ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపారు.కోదాడ మీదుగా బుల్లెట్ రైలు వెళ్లడం వ్యక్తిగత డిమాండ్ కాదని, ఇది ప్రజల ఆకాంక్ష, భావితరాల అవసరమని మల్లయ్య యాదవ్ అన్నారు. గతంలో హైదరాబాద్,కోదాడ ప్రయాణం ఎంతో కష్టంగా ఉండేదని, ప్రజా పోరాటాల ఫలితంగా రహదారి సౌకర్యం మెరుగుపడిందని గుర్తుచేశారు. అదే తరహాలో రాబోయే తరాల కోసం రైలు సౌకర్యాన్ని సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కోదాడలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, వ్యాపార కేంద్రాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో హైస్పీడ్ రైలు వస్తే విద్య, ఉపాధి, పరిశ్రమలు, వ్యాపార రంగాలకు మరింత ఊతం లభిస్తుందన్నారు. అలైన్‌మెంట్ ఖరారులో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైల్వే శాఖను కోరారు. కోదాడకు బుల్లెట్ రైలు సాధించే వరకు రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



# విద్యార్థుల భద్రతకు పెద్దపీట

- డ్రైవర్లకు యూనిఫామ్‌లు
- రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** విద్యార్థుల సురక్షిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ పబ్లిక్ పాఠశాల యాజమాన్యం స్కూల్ బస్సుల డ్రైవర్లకు యూనిఫామ్‌లను అందజేయడంతో పాటు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ డ్రైవర్లకు యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదన్నారు. బస్సుల్లో విద్యార్థులు ఎక్కే, దిగే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్ణీత వేగ పరిమితిని పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు.డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, రద్దీ ప్రాంతాలు, వర్షాలు కురిసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. బస్సుల పరిస్థితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించేలా డ్రైవర్లు సిద్ధంగా ఉండాలని సూచించారు.విద్యార్థులకు విద్యతో పాటు భద్రతకు కూడా పాఠశాల సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. డ్రైవర్లకు యూనిఫామ్ అందించడం ద్వారా క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మర్యాదగా వ్యవహరిస్తూ పాఠశాల ప్రతిష్ఠకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు.విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం పాఠశాల యాజమాన్యం, డ్రైవర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, పాఠశాల సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.




# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనరసింహ
- ఉమ్మడి మెదక్ జిల్లా పీఏసీ సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శనాస్త్రాలు



**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపుకాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ప్రధాన బలమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు, పదవులు దక్కుతాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ స్పష్టం చేశారు.సోమవారం మెదక్ పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్ లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా పీఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో ఏం చేశారో మాజీ మంత్రి హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలు, అవినీతి ప్రజలకు ఇంకా గుర్తున్నాయన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని సూచించారు.గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు నెలలో 20వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు విషయంలో రైతులపై కేసులు పెట్టిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగించారని, కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన పలు కంపెనీలను అదానీ, అంబానీలకు అప్పగించారని ఆరోపించారు.తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని, అర్హులైన పేదలు ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యత ఉందని, బీఆర్ఎస్ లో రాజయ్య, ఈటల రాజేందర్ వంటి నేతలను అన్యాయంగా తొలగించారని విమర్శించారు. పార్టీ నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ – ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మంత్రి దామోదర్ రాజనరసింహ మాట్లాడుతూ.. తాము ఈ స్థాయిలో ఉన్నామంటే అందుకు కార్యకర్తల కృషే కారణమని, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, భవిష్యత్తులోనూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే లక్ష్యంతో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తమ ఓట్లను తామే పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీకి నష్టం కలిగించే వర్గాలను ప్రోత్సహిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు.



# రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం.. ఉపయోగంలోకి రాని వైనం!

- శివాజీనగర్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్ అధ్వాన స్థితి
- రూమ్‌లు ఖాళీగా ఉండి వృథా
- పట్టించుకోని అధికారులు

**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని శివాజీనగర్‌లో నిర్మించిన వాణిజ్య సముదాయం (కాంప్లెక్స్) అధికారుల అలసత్వం వల్ల నిరుపయోగంగా మారింది. 2013లో నిర్మించిన ఈ భవనంలో దాదాపు 78 షాపింగ్ రూమ్‌లను అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి, విద్యుత్ సౌకర్యంతో పాటు ఇతర మౌలిక వసతుల కోసం సుమారు రూ.15 లక్షలు వెచ్చించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ భవనం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది.

**మరమ్మతులు లేక శిథిలావస్థకు..**

సరిగ్గా నిర్వహణ లేకపోవడంతో కాంప్లెక్స్ ఆవరణలో పెద్ద ఎత్తున చెట్లు, పిచ్చిమొక్కలు మొలిచి గోడలను, భవన నిర్మాణాన్ని దెబ్బతీస్తున్నాయి. కనీసం వీటిని తొలగించకపోవడంతో భవనం కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగువ అంతస్తులోని రూమ్‌లను వ్యాపారులకు కేటాయించినప్పటికీ, పైఅంతస్తులోని 78కి పైగా గదులు షట్టర్లు మూతపడి ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

**ఆదాయాన్ని కోల్పోతున్న కార్పొరేషన్**

ఈ ఖాళీ గదులను తక్కువ అద్దెకు వ్యాపారులకు ఇవ్వడం గానీ లేదా బ్యాంకులు, ఏటీఎంలు, పోస్టాఫీస్, ఫంక్షన్ హాల్స్ వంటి ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థలకు కేటాయించడం గానీ చేస్తే మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున రాబడి వచ్చే అవకాశం ఉంది. నిబంధనలను సవరించి అయినా సరే ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని, తక్షణమే చెట్లను తొలగించి శుభ్రపరచాలని మేయర్, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లను స్థానికులు కోరుతున్నారు.

# పెట్రోల్ బంకుల్లో ఉచిత సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన కీసర మండల సామాజిక సేవా కార్యకర్తలు

**ప్రజావాయిస్, కీసర :** కీసర మండలంతో పాటు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు అవసరమైన ప్రాథమిక ఉచిత సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, కీసరగుట్ట మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు రాగుల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు ఉచితంగా అందించాల్సిన సౌకర్యాలు సక్రమంగా అందుబాటులో లేవని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రతి పెట్రోల్ బంకులో ఉచిత గాలి, శుభ్రమైన తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టె, ఫిర్యాదు/సూచనల పుస్తకం, ఉచిత మరుగుదొడ్డి వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కీసర మండలంలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో మరుగుదొడ్లు మినహా ఇతర ఉచిత సౌకర్యాలు అందుబాటులో లేవని తెలిపారు.ప్రధాన డిమాండ్లుజిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి.ఉచిత సౌకర్యాలు వాస్తవంగా అందుబాటులో ఉన్నాయో పరిశీలించాలి.అందుబాటులో ఉన్న సౌకర్యాల వివరాలను ప్రతి బంకులో స్పష్టంగా ప్రదర్శించాలి.నిబంధనలు ఉల్లంఘించే బంకులపై తగిన చర్యలు తీసుకోవాలి.తనిఖీల ఫలితాలు, తీసుకున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలి.ప్రజల హక్కులు, భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు చిలుక ముత్యాల ముదిరాజ్, తుడుం ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.



# చివరికి తానే బలి అయింది

- తల్లిదండ్రుల హత్య కేసులో నిందితురాలి అనూహ్య ఆత్మహత్య
- ఆరు నెలలకే విషాదాంతమైన సురేఖ జీవితం
- బెయిల్‌పై బయటకు వచ్చి హాస్టల్‌లో బలవన్మరణం
- తల్లిదండ్రులకు మత్తు మందు ఇచ్చిన కేసులో జైలు జీవితం
- అదే మత్తు మందుతో ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు
- సంగారెడ్డి హాస్టల్‌లో మృతి.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** ప్రియుడి మోజులో కన్న తల్లిదండ్రులకి మత్తుమందు ఇచ్చి హత్య చేసిన కేసులో బెయిల్పై విడుదలైన కూతురు అదే మత్తుమందు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా బట్వారం మండలం యాచారం గ్రామానికి చెందిన నక్కల సురేఖ(25) ఎస్ఐటీ చేసి కొద్ది నెలలుగా సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. 2026 జనవరిలో తన ప్రేమ వివాహానికి నిరా కరించారని తల్లిదండ్రులు లక్ష్మి, దశరథను మత్తు ఇంజక్షన్ ఇచ్చి చంపేసింది. ఈ కేసులో ఆమె నిందితురాలుగా తేలగా కోర్టు ఆమెకు శిక్ష విధిస్తూ చంచల్గూడ జైలుకు తరలించారు. జూలై 31న ఆమె బెయిల్ పై జైలు నుంచి విడుదలైంది. సొంత ఊరు వెళ్లి మొహం చూపించుకునే పరిస్థితి లేక ఆమె తిరిగి సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ ఉద్యోగం కోసం వెతుకుతోంది. ఇదే తరుణంలో ఈ నెల 23న సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో మత్తు మందు ఇంజక్షన్ ఇచ్చుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామునాయుడు తెలిపారు.




కూతురు రాసిన మరణ శాసనం

# బతుకుజట్కాబండి భారమే!

- నిత్యవసర వస్తువుల ధరల మండిపాటు
- ఆదాయం మించి ఖర్చులు భారం పెరగటంతో కుదేలవుతున్న వైనం?
- కేంద్ర, రాష్ట్ర. ప్రభుత్వాల ధరల నియంత్రణ జడే లేని పాలన?
- ప్రశ్నార్ధకంగా మిగులుతున్న సామాన్యుడు జీవితం!
- ఆర్థిక పరిస్థితులలో అప్పుల్లో కూరుకు పోతున్న ప్రజానీకం?



**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** ప్రస్తుత పరిస్థితులలో మానవ మనుగడికి నిత్యవసర వస్తువులు ఎంతో సహాయపడతాయి. వీటి వినియోగం రోజు పెరిగిపోవడంతో ధరల సైతం మండి బతుకుజట్కాబండి భారంగా మారటమే కాకుండా ఆదాయానికి మించి ఖర్చులు భారం పెరగటంతో సామాన్యుడు జీవితం కుదిలైపోతున్న పరిస్థితి కనిపిస్తుంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణ పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో ప్రశ్నార్థకంగానే సామాన్యుడు జీవితం మిగిలిపోతుందని ఆర్థిక పరిస్థితులలో అప్పుల్లో కూరుకుపోవటమే తప్ప అభివృద్ధి జరగటం సాధ్యపడే పరిస్థితి లేదని తెలుస్తుంది. మధ్యతరగతి కుటుంబాలలో విద్య మరియు ఆరోగ్య సమస్యల కోసం స్థిరాస్తులను సైతం విక్రయాలు జరిపి కొనసాగించిన చివరికి గమ్యం చేరుకునే పరిస్థితి కూడా లేకపోవడం ఒక ప్రశ్నార్థకమే! పప్పు ఉప్పు ఆయిల్ బియ్యం కూరగాయలు దుస్తులు ఇంటి నిర్మాణానికి కావాల్సిన మూడు పదార్థాలు వంటి ప్రతి వస్తువుపై నెల నెల అధిక మొత్తంలో ధరల పెరగటంతో రోజువారి ఆదాయం బెత్తుడు ఖర్చులు మాత్రం మోరలాగా బతుకుజట్కాబండి కొనసాగే పరిస్థితి ఏర్పడింది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపరెడ్డిపల్లి. వంటి మండలాల్లో భారీగా ఏజెన్సీ గ్రామాలలో అమాయక గిరిజనులు జీవనం కొనసాగిస్తుంటారు అంతేకాకుండా మీరు వృత్తి వ్యవసాయం ఇటువంటి దానినే తరతరాలుగా కొనసాగించుకుంటూ వస్తున్న అభివృద్ధిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉండటమే తప్ప కాస్తంత కూడా అభివృద్ధి జరిగిన గ్రామాలకు కనిపించే పరిస్థితి ఉండవు అని తెలుస్తుంది నిజానికి ప్రస్తుత రోజుల్లో పప్పు ఉప్పు కూరగాయలు వ్యవసాయానికి ఉపయోగించే క్రిమిసమహార మందులతో పాటు యంత్రాలు మరియు నిత్యవసర వస్తువులతో పాటు దుస్తులు రోజురోజుకీ అధిక ధరలు వ్యాపారస్తులు ప్రకటించి జీరో వ్యాపారంపై కొనసాగిస్తున్న సంబంధిత శాఖ గానీ అధికార యంత్రాంగం గాని స్పందించే పరిస్థితి కనిపించడం లేదు అంతేకాకుండా కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వ పాలన విధానంలో కూడా ఇటువంటి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సామాన్యుడు జీవితం ఒక ప్రశ్నార్ధకమే ప్రస్తుత రోజుల్లో నిత్యవసర వస్తువులు ధరలు మండిపోవడంతో కొనాలన్న తినాలన్నా భయపడే పరిస్థితి ఉంటుందని ఇటువంటి విధానానికి ప్రభుత్వం పెట్టే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజానికం కోరుకుంటున్న అమలు చేసే విధానం మాత్రం లేదని నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్లో తీవ్రంగా ఖండిస్తున్నారు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు టాక్స్ ల రూపంలో వివిధ రకాలుగా ప్రజలపై భారాలు మోపి దండుకుంటున్నారే తప్ప నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణ మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదని ఇటువంటి పరిస్థితులలో సామాన్యుడు అప్పుల వైపే చూస్తున్నాడే తప్ప ఆదాయం వచ్చే మార్గాలు లేక సతమతమవుతున్నాడని ప్రజల వాదన ఏదేమైనా ప్రభుత్వాలు పాలకులు సైతం ప్రజల బాగోగులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోతుందని కేవలం ఆదాయాన్ని సమకూర్చుకునే పనిలో పంచాయితీల నుండి మున్సిపాలిటీ వరకు వివిధ రకాల పనులను విధించి మనుషులను వేధించడమే తప్ప వారి బాగోగులను పట్టించుకునే యంత్రాంగం లేకుండా పోతుందని ప్రభుత్వం స్పందిస్తే సామాన్యుడికి కొంత ఊరట కలిగే అవకాశం ఉంటుందని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు



# 26 ఏండ్ల తర్వాత ఇంటికి వచ్చి ఓదార్చారు

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ దంపతులకు ఇనుముల సత్యనారాయణ ధన్యవాదాలు

**ప్రజా వాయిస్ మంథని** మంథని మండల మాజీ ఉపసర్పంచ్, స్వర్గీయ ఇనుముల గౌరమ్మ కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, మంథని మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీమతి పుట్ట శైలజ దంపతులు సోమవారం పరామర్శించారు. గత నెల 25న అనారోగ్యంతో మృతి చెందిన గౌరమ్మ నెల మాసికం సందర్భంగా మంథనిలోని వారి నివాసానికి చేరుకున్న బిఆర్ఎస్ నాయకులు, గౌరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌరమ్మ కుమారుడు, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ మాట్లాడుతూ... గత నెల సికింద్రాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయం నుంచి తమ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు. దాదాపు 26 ఏండ్ల తర్వాత తమ ఇంటికి వచ్చి, తల్లిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న తమ కుటుంబాన్ని ఓదార్చిన పుట్ట దంపతులకు సత్యనారాయణతో పాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# నేలకొండపల్లి ప్రజావాణిలో అధికారుల నిర్లక్ష్యం?

- వారానికి ఒక్క రోజైనా సమయపాలన పాటించరా?
- హాస్యం అవుతున్న ప్రజావాణి కార్యక్రమం
- బిల్డింగ్ మారింది తప్ప బాధ్యత పెరగలేదు!

**ప్రజా వాయిస్ ఖమ్మం:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజావాణి వేదికను తహసీల్దార్ ఆఫీస్ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి మార్చినా, ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల అధికారుల తీరులో మాత్రం ఏ మార్పూ రాలేదు. ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రతి మండల అధికారి విధిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. వారానికి ఒక్కసారి ప్రజలకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు నిబంధనలను పూర్తిగా బేఖాతరు చేస్తున్నారు. ఉదయం ఆలస్యంగా రావడమే ఒక ఎత్తైతే వచ్చి ఏదో నామమాత్రంగా రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి, వెంటనే కార్యాలయం నుంచి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది.ప్రభుత్వం వేదికలు మార్చినా, అధికారుల సమయపాలనలోనూ, బాధ్యతాయుత ప్రవర్తనలోనూ ఎలాంటి మార్పు రాలేదని దీనివల్ల స్పష్టమవుతోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి నిరీక్షించే అర్జీదారుల గోడు పట్టించుకునే నాథుడే కరువవుతున్నారు. కేవలం బిల్డింగ్‌లు మారాయే తప్ప అధికారుల పనితీరులో చలనం రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వైఖరిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపడితేనే గానీ బాధ్యతారాహిత్యానికి చెక్ పడే అవకాశం ఉంటుంది.



# చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- సెంట్రల్ జోన్ డిసిపి దారా కవిత




**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగ మిల్స్ కాలనీ మరియు సిసిఎస్ పోలీసలు స ంయుక ్తంగా సోమవారం అరెస్టు చేసారు. నిందితుడి నుండి సుమారు 12 లక్షల విలువ గల 70.19 గ్రాముల బంగారు అభరణాలు, 527.9గ్రాముల వెండి, 29,875/` రూపాయలు నగదు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలకు సంబంధించి మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, అదేశాల ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కాలంగా జరిగిన చోరీలను విశ్లేషణ చేయగా సోమవారం ఉదయం ఒక అనుమానిత వ్యక్తిని అదుపులో తీసుకోని విచారించగా మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబందించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల,(27) నివాసం పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం మహరాష్ట్ర లోని చంద్రపూర్‌లో నివాసం వుంటున్న నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాని తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మీల్స్ కాలనీ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో అరెస్టు నిందితుడు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోని విచారించగా నిందితుడు పగటి సమాయల్లో తాళం వేసివున్న ఇండ్లను గుర్తించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవాడు. ఇదే రీతిలో నిందితుడు 2024, 2025 మహరాష్ట్రలో మొత్తం నాలుగు చోరీలకు పాల్పడటంతో నిందితుడిని మహరాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించగా, బెయిల్‌పై విడుదల ఆయిన అతనిలో ఎలాంటి మార్పురాకపోవడం మరో మారు నిందితుడు ఈ సంవత్సరం మీల్స్ కాలనీ పరిధిలోని శివనగర్, ఎస్.ఆర్.ఆర నగర్ ప్రాంతంలో తాళం వేసి వున్న ఇండ్లల్లో వరుస చోరీలకు పాల్పడినట్లుగా నిందితుడు విచారణలో వెల్లడించాడు. చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్ స్పెక్టర్ రామకృష్ణ,మీల్స్‌కాలనీ ఇన్స్ స్పెక్టర్ స్వామి, ఎస్. ఐ మహేష్, ఏ. ఏ.ఓ సల్మాన్ పాషా తో పాటు ప్రింగ్ సిసి ఎస్. మీల్స్ కాలనీ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# వెలవెలబోతున్న సింగూర్....



- 29.9 టీఎంసీల సామర్థ్యమున్న ప్రాజెక్టులో 4.3 టీఎంసీల నీటి నీల్వ..
- మరమ్మతులు, వర్షాభావంతో అడుగంటుతున్న నీటి నిల్వలు
- తాగు, సాగునీటిపై తీవ్ర ప్రభావం
- ప్రత్యామ్నాయాలు చూడాలని ప్రజలు, రైతుల డిమాండ్

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** ఉమ్మడి మెదక్ జిల్లాకు వరప్రదాయినిగానిలిచిన సింగూరు ప్రాజెక్టు ప్రస్తుతం నీరులేక వెలవెలబోతోంది. ఒకప్పుడు జలకళతో ఉట్టిపడిన ఈ జలాశయం నేడు అడుగంటిన నీటిమట్టంతో దర్శనమిస్తోంది. సుమారు 29.9 టీఎంసీల పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 4.3 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో హైదరాబాద్ మహానగరంతో పాటు సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నాలుగు దశాబ్దాలుగా నగరానికి ఆధారంమహారాష్ట్రలో పుట్టి కర్ణాటక మీదుగా తెలంగాణలో ప్రవహించే మంజీరా నదిపై సంగారెడ్డి జిల్లా వద్ద సింగూరు ప్రాజెక్టును నిర్మించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాలు తీర్చడంలో నాలుగు దశాబ్దాలుగా ఇది కీలక పాత్ర పోషిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీటి వనరుగానూ ఉపయోగపడుతోంది. సింగూరు నుంచి మంజీరా బ్యారేజీకి వీటిని తరలించి అక్కడి నుంచి హైదరాబాద్కు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సింగూరు నుంచి రోజుకు సుమారు 70 ఎంఎల్ డీలు, మంజీరా బ్యారేజీ నుంచి మరో 40 ఎంజఎల్ డీల నీటిని నగరానికి తరలిస్తున్నారు. అయితే నిల్వలు పడిపోవడంతో నీటిని పంపింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**మరమ్మతుల నేపథ్యంలో నిల్వపై ఆంక్షలు**

సింగూరు ఆనకట్ట రివెట్మెంట్ బలహీనంగా ఉందని డ్యామ్ సేఫ్టీ అధికారులు తేల్చడంతో ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టింది. ఇందుకోసం కోట్లాది రూపాయలు కేటాయించినప్పటికీ పనుల్లో ఆశించిన వేగం కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆనకట్ట పటిష్ఠపరిచే వరకు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయవద్దని నిపుణులు సూచించడంతో వచ్చిన వరద నీటిని దిగువకు విడుదల చేయాల్సి వస్తుంది. భారీ వర్షాలు కురిసిన సమయంలోనూ నీటిని నిల్వ చేసుకోలేకపోవడం ప్రస్తుత కొరతకు ప్రధాన కారణమైంది. తగ్గిన వర్షపాతం.. కానరాని వరద ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా సింగూరు ఎగువ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఇతర ప్రాజెక్టులకు కొంతమేర వరద చేరుతున్నా, సింగూర్‌కు మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో నీటి ఇన్ ఫ్లో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా సెప్టెంబర్లో వరద వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎగువన భారీ వర్షాలు కురిస్తేనే తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.



**రైతులకు 'క్రాప్ హాలిడే' నష్టం**

ప్రాజెక్టు మరమ్మతులు, నీటి కొరత కారణంగా గత యాసంగి నుంచే ఆయకట్టు పరిధిలో పంట విరామం (క్రాప్ హాలిడే) ప్రకటించారు. ఈ వర్షాకాలంలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు బోర్లపైనే ఆధారపడుతున్నారు. సింగూరు కింద ఉన్న సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టు రైతులతో పాటు దిగువ ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగు నిలిచిపోయినందున ప్రభుత్వం తమకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

***నిలిచిపోయిన కాలువల ఆధునికీకరణపనులు ***

సింగూర్ ప్రాజెక్ట్ ఎడుమ కాల్వ (మట్టి కాలువలుగా ఉన్నా కేనాలిని సీసీ గా మార్చేందుకు) ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సుమారు 48 కిలోమీటర్ల కాలువల నిర్మాణానికి రూ.168 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. అయితే కొంత భాగం పూర్తయ్యాక పనులు నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు వేగవంతం కాకపోతే రెండు పంటలనూ కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు గేట్ల వద్ద రబ్బర్ సీల్స్ పాడై నీరు లీక్ అవుతుండటంపై విమర్శలు వస్తుండగా, నివారణ చర్యలు చేపట్టామని అధికారులు చెబుతున్నారు.

**ముందస్తు ప్రణాళిక అవసరం**

నీటి నిల్వలు వేగంగా తగ్గుతుండటంతో ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేసుకోవాలని ప్రజలు, నిపుణులు కోరుతున్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల దృష్ట్యా పరిస్థితి మరింత జటిలం కాకముందే ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాల్సిన అవసరముంది.



# గోడ దూకి బయటకు వెళ్లిన ఇంటర్ విద్యార్థులు

- అధ్యాపకుల కొరతపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లేందుకు యత్నం

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లోని సీఓఈ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొందరు విద్యార్థులు గోడ దూకి కళాశాల నుంచి బయటకు వెళ్లిన ఘటన కలకలం రేపింది. కళాశాలలో అధ్యాపకుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం తెల్లవారుజామున కళాశాల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వెళ్లిన విషయాన్ని గుర్తించిన అధ్యాపకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై విద్యార్థుల ఆచూకీ కోసం చర్యలు చేపట్టారు. విద్యార్థులు బెల్లంపల్లి నుంచి భాగ్యనగర్ వెళ్లే రైలు ఎక్కేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులతో మాట్లాడి వారిని తిరిగి కళాశాలకు తీసుకొచ్చారు.అనంతరం కళాశాల అధ్యాపకులు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అధ్యాపకుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో విద్యార్థులు శాంతించి తిరిగి కళాశాలకు చేరుకున్నారు. కొద్దిసేపు కళాశాల పరిసరాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు అధ్యాపకులు, పోలీసుల జోక్యంతో సద్దుమణిగాయి. అయితే విద్యార్థులు కళాశాల గోడ దూకి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించడం అధ్యాపకులు, కళాశాల సిబ్బందిలో ఆందోళనకు కారణమైంది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కళాశాల యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో విద్యార్థులు ప్రస్తావించిన అధ్యాపకుల కొరత సమస్యను అధికారులు పరిశీలించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తగిన బోధనా సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# పిల్లాయపల్లి గ్రామంలో అధ్వాన్నంగా మారిన రహదారులు

- నరకయాతన పడుతున్న వాహనదారులు, గ్రామస్తులు.

**ప్రజా వాయిస్ / పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలోని పిల్లాయపల్లి గ్రామంలో రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో వర్షం పడితే రోడ్లు బురదమయంగా మారి విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, గ్రామ పరిసర ప్రాంతాల్లో నడుస్తున్న క్రషర్ మిషన్ల భారీ లారీల రాకపోకల వల్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో దుమ్ము, గుంతలు, బురద కారణంగా ప్రజల రాకపోకలు ప్రమాదకరంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలాగే భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సాధించి గ్రామాన్ని సందర్శించి, శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసి రహదారుల అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ప్లాస్టిక్ 'కాల్చినా'.. వాడినా మనుషుల ప్రాణాలకే ప్రమాదం!

- మౌనప్రేక్షకులుగా మున్సిపల్ పాలకులు
- పట్టించుకోని యంత్రాంగం
- ఓట్లకు వేలల్లో వదిలి.. లాభాల వేటలో ప్రజాప్రతినిధులు!
- విషవాయువులతో క్యాన్సర్ ప్రమాదం ఉందంటున్న వైద్య నిపుణులు
- జిల్లా కలెక్టర్ అయినా స్పందించి సంపూర్ణ నిషేధం విధించాలని ప్రజల డిమాండ్




**ప్రజా వాయిస్ మంథని** మంథని పురపాలక సంఘంలో ప్లాస్టిక్ మహమ్మారి స్వైర విహారం చేస్తోంది. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ఏకంగా 200 శాతానికి పైగా పెరిగిపోయిందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధులు, డ్రెయిన్లు, వ్యాపార సముదాయాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

**చేతులెత్తేసిన పాలకవర్గం**

మున్సిపల్ ఎన్నికల వేళ సీటు దక్కించుకుని కొత్తగా పీఠంపై కూర్చున్న మున్సిపల్ పాలకులకు పట్టణ పారిశుధ్యం, ప్రజారోగ్యం పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతసేపూ తమ స్వలాభాలు చూసుకోవడం, అధికారాన్ని అనుభవించడం తప్ప ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా అరికట్టేందుకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఓటుకు... చొప్పున పంచి గెలిచాం కదా, ఇక ప్రజల సమస్యలు మాకెందుకు? అనే ధోరణిలోనే నాయకుల వ్యవహారశైలి ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఇచ్చిన వేల బదులుగా లక్షలు, కోట్లు ఎలా సంపాదించుకోవాలనే ఆశ తప్ప ప్రజలకు సేవ చేద్దాం, వారి సమస్యలు తీరుద్దాం అనే బాధ్యతాయుతమైన ఆలోచన పాలకులలో మృగ్యమైపోయిందని మేధావులు, పట్టణవాసులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

**కలెక్టర్ గారూ.. మీరైనా చర్యలు తీసుకోండి!**

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల వ్యాపార ధోరణి వల్ల మంథని పట్టణం రోజురోజుకూ ప్లాస్టిక్ కుప్పగా మారుతోంది. ఇకనైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, మంథని మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై సంపూర్ణ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలు విధించాలని పట్టణ ప్రజలు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



## చౌటుప్పల్ హైవే బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి

- పనులను పరిశీలించి ఆర్డీవోకు వినతి అందజేత
- బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు సుర్వి యాదయ్య గౌడ్..

**ప్రజావాయిస్/చౌటుప్పల్** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలో హైదరాబాద్,విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న బ్రిడ్జి, రోడ్డు పనులను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలిసి చౌటుప్పల్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.పనుల్లో తీవ్ర జాప్యం వల్ల నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు, రాత్రివేళల్లో లైటింగ్ వంటి రక్షణ చర్యలు చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఆర్అండ్‌బీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. స్థానిక సమస్యలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో కొయ్యడ శేఖర్ గౌడ్,బిఆర్ఎస్ నాయకులు నలపరాజు రమేష్, బోయ శ్రీరాములు, బత్తుల సింహాద్రి, తెలంగాణ బిక్షం, సత్తయ్య, పొట్ట జంగయ్య, సుర్వి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## కాసిపేటలో పేకాట రాయుళ్ల గుట్టురట్టు

- ఆరుగురు అరెస్ట్, రూ.20 వేల నగదు సీజ్!

**ప్రజా వాయిస్ మంచిర్యాల/** క్రైమ్ మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దుబ్బాగూడెం శివారులో పోలీసులు దాడులు నిర్వహించి, పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.స్థానిక ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాగూడెం శివారు ప్రాంతంలో అసాధారణ కార్యకలాపాలు జరుగుతున్నట్లు అందిన పక్కా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఒక్కసారిగా ఆ ప్రాంతంపై దాడి చేశారు. అక్కడ బహిరంగంగా ముగ్గురు ముక్కల పేకాట ఆడుతున్న వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ దాడిలో నిందితుల వద్ద నుంచి మొత్తం రూ.20,170 నగదుతో పాటు 6 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు




## గౌరవెల్లిని త్వరగా పూర్తి చేసి హుస్నాబాద్‌కు సాగునీరందిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

**జా వాయిస్ హుస్నాబాద్** గౌరవెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న' ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గౌరవెల్లి ప్రాజెక్ట్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులను మంజూరు చేసిందని, నిధులు అందగానే అర్హులైన రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.అలాగే ఎకరానికి రూ.2 లక్షల వరకు ఆదాయం ఇచ్చే ఆయిల్‌ఫామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని, భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేసి, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి అందుతున్న రైతుభరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, రేషన్ తదితర సంక్షేమ పథకాల లబ్ధిని అధికారులు వెల్లడించగా, ప్రజల నుంచి వచ్చిన వినతులను అక్కడికక్కడే పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## వర్షానికి కూలిన పెంకుటిల్లు

- ఇళ్ళు లేక రోడ్డున పడ్డామని కుటుంబ ఆవేదన
- ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**ఆగస్ట్ 24 ( ప్రజా వాయిస్) చేగుంట:** వర్షం కారణంగా చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో ఆదివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాకలి రాములు, పెంకుఇల్లు పై కప్పు గోడ కూలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన గురయ్యారు, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంత ఊపిరిపించుకున్నారు, అయితే ఇల్లు కూలిపోవడంతో నివాసం లేక ఆకుటుంబం రోడ్డున పడ్డామని బాధితులు ఆవేద వ్యక్తం చేశారు, నిరుపేదములైన తమను ప్రభుత్వం ఆదుకోవా



లని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు కోరారు.

# పరకాల ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థుల మహాధర్నా

- తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా పాలిటెక్నిక్ విద్యను కాలరాసేందుకు తీసుకొచ్చిన GO. No. 97ను వెంటనే ఉపసంహరించుకోవాలి
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (YISU) ని PPP విధానంలో కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలి
- పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకుల భవిష్యత్తును ఆగం చేస్తే...ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు
- తక్షణమే తెలంగాణ విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి స్పందించి.. విద్యార్థులు, అధ్యాపకులకు భరోసా కల్పించాలి



**ప్రజా వాయిస్ హన్మకొండ** /పరకాల తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులు, అధ్యాపకులు మరియు ఇతర భాగస్వామ్య వర్గాల ప్రజాస్వామ్య అభిప్రాయాలను తీసుకోకుండా, కొత్తగా ప్రతిపాదించిన శక్తి స్కీమ్ కింద పారిశ్రామిక శిక్షణా సంస్థలు (ఇటీస్ ), ఏటీసీ లు మరియు పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయడం లేదా సంస్థాగతంగా ఏకీకృతం చేసే ప్రతిపాదనలపై ABVP తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా, పాలిటెక్నిక్ విద్యను కాలరాసేందుకు తీసుకొచ్చిన GO No.97ను ఉపసంహరించుకోవాలని.ఈ సందర్భంగా ABVP పరకాల కార్యదర్శి బాల్సుకూరి కార్తీక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం G.O.Ms.No. 97, ద్వారా కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు ఫ్యాక్టరీల శాఖ పేరును డిపార్ట్మెంట్ అఫ్ స్కిల్ హ్యూమన్ కాపిటల్ అండ్ కనొలెడ్జి ట్రైనింగ్ ఇన్నిటిటివ్స్ శక్తి గా మార్చిందనీ, ఈ ఉత్తర్వుల ప్రకారం అన్ని ఐటి లు మరియు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు (ATCS ) అన్ని యంగ్ ఇండియా యూనివర్సిటీ (YISU) సంస్థాగత పరిధిలోకి తీసుకురావాలని, అలాగే అన్ని పాలిటెక్నిక్ కళాశాలలను కూడా YISU పరిధిలోకి తీసుకురావాలని పేర్కొందనీ, ఇందుకు సంబంధించిన చట్టాలు మరియు నిబంధనల్లో అవసరమైన సవరణలు చేయాలని కూడా ప్రతిపాదించిందన్నారు. కానీ ఇలాంటి పునర్వ్యవస్థీకరణను తగిన సంప్రదింపులు, స్పష్టత లేకుండా అమలు చేస్తే, వివిధ సాంకేతిక మరియు వృత్తి విద్యా విభాగాలకు చెందిన విద్యార్థుల విద్యా గుర్తింపు, సంస్థాగత స్వయం ప్రతిపత్తి, మౌలిక వసతులు, పాఠ్య ప్రణాళిక, ప్రవేశాల విధానం, పరీక్షల వ్యవస్థ మరియు భవిష్యత్ అవకాశాలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికశాఖ కింద నడిచే ఐటి , ఏటీసీ లను; ఐసీతే ఆధ్వర్యంలో నడిచే పాలిటెక్నిక్లను ఏ విధంగా ఏకీకృతం చేస్తారని నిలదీశారు. ప్రైవేట్, ప్రభుత్వ అనుబంధంలో నడిచే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (YISU) పరిధిలోకి గత 70 సంవత్సరాలుగా విజయవంతంగా నడిచే వ్యవస్థలను ఏ విధంగా తీసుకొస్తారని నిలదీశారు. విద్యార్థులు ECET ఎత్తేస్తారని, లేటరల్ ఎంట్రీ ఉండదని, ఉన్నత విద్యకు అనర్హులమౌతామని మొత్తుకుంటుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇంజనీర్స్ కావలసిన మమ్మల్ని లేబర్గా మార్చే కుట్ర జరుగుతున్నదని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకం నుండి పాలిటెక్నిక్ విద్యార్థులను తప్పించడానికే PPP విధానంలో నడిచే స్కిల్స్ యూనివర్సిటీకి మమ్మల్ని అనుసంధానం చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారని, దీనిపై ప్రభుత్వం ఎందుకు స్పందించట్లేదన్నారు. సర్టిఫికెట్స్ కోర్సులు అందించే యూనివర్సిటీ పరిధిలోకి ఒక విజయవంతం అయిన పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను అనుసంధానించడం హేయమని అన్నారు. ప్రభుత్వం ఒకవేళ విద్యార్థులకు, అధ్యాపకులకు లాభం చేకూర్చేవిధంగా చూస్తున్నట్లైతే ఎందుకు విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ రోడ్డు ఎక్కుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే తెలంగాణ విద్యాశాఖ మంత్రి రేవంత్రెడ్డి దీనిపై స్పందించాలని, వెంటనే ఈ విషయంపై సమీక్షించి విద్యార్థులు మరియు లెక్చరర్లలో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలను నివృత్తి చేయడంతో పాటు, వారి భవిష్యత్తుపై భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, లెక్చరర్లు, విద్యావేత్తలు మరియు ఇతర భాగస్వామ్య వర్గాల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకుంటున్న చర్యల వల్ల ఈ విద్యాసంస్థలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యను కాపాడుకోవడం మన కర్తవ్యమని, ఈ ఉద్యమానికి తెలంగాణ సమాజం మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులకు న్యాయం జరిగేవరకు ABVP పోరాటం కొనసాగిస్తుందని హామీనిచ్చారు. ఈ నెల 25వ తేదీన ABVP తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్ను విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు, విద్యావేత్తలు విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ఆకుతోట భానువరప్రసాద్, భాషబోయిన జస్వంత్, భరణి,గౌతమ్, అభి,అజయ్, విద్యార్థి నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.a

## మొక్కకి ముఖ్యమైన మూలకాలతోనే మంచి దిగుబడి

- రైతులకు మనిషి శరీరం ఉదాహరణతో ఆకట్టుకునే అవగాహన కల్పించిన సంతోష్
- అధిక యూరియా వాడకం పంటకు చేటు
- మానవ శరీరానికి పోషకాలలాగే మొక్కలకూ 16 రకాల పోషకాలు అవసరం

**ప్రజా వాయస్ నారాయణఖేడ్** కంగ్టి మండల పరిధిలోని బీమ్ర రెవెన్యూ గ్రామంలో సోమవారం నాడు రైతులకు "పత్తి పంటలో సమగ్ర పోషక యాజమాన్యం"పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణులు రైతులతో మాట్లాడుతూ, ప్రస్తుతం లభ్యత, తక్కువ ధర కారణంతో రైతులు అధిక మొత్తంలో యూరియాను (నత్రజని) పత్తి పంటకు వినియోగిస్తున్నారని, ఇది పంట ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఒకే రకమైన ఎరువును వాడటం వల్ల కాండం బలహీనపడి, పురుగులు మరియు తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని హెచ్చరించారు.మానవ శరీర ఉదాహరణతో అవగాహన:
రైతులకు సులభంగా అర్థమయ్యేలా మానవ శరీర పోషకాలతో పోల్చి వివరించారు.
"మనిషి శరీరంలో ఎముకలు దృఢంగా ఉండటానికి క్యాల్షియం ఎంత అవసరమో, వైద్యులు మన అవసరానికి తగినట్లు విటమిన్లు, క్యాల్షియం టాబ్లెట్లు ఎలా సూచిస్తారో... అలాగే మొక్కల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు మొత్తం 16 రకాల మూలకాలు (ఎసెన్షియల్ న్యూట్రియంట్స్) అవసరమవుతాయి" అని పేర్కొన్నారు.వివిధ దశల్లో పోషకాల ప్రాధాన్యత:పంట పెరిగే ప్రతి దశలో వేర్వేరు మూలకాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు:
★ వేరు వ్యవస్థ బలపడటానికి: ఫాస్ఫరస్ (భాస్వరం) వంటి మూలకాలు ఎంతో అవసరం.
★ మొక్క ఎదుగుదలకు: తగినంత నత్రజని తోడ్పడుతుంది.
★ పూత, కాత పటిష్టతకు: పొటాషియం, బోరాన్ మరియు ఇతర సూక్ష్మ పోషకాలు (మల్టీ న్యూట్రియంట్స్) అత్యంత కీలకం.పంటకు ఏ దశలో ఏ పోషకం కావాలో గుర్తించి సమగ్ర యాజమాన్యాన్ని పాటించినప్పుడే నాణ్యమైన దిగుబడి మరియు అధిక నికర లాభాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. మట్టి పరీక్ష నివేదికల ఆధారంగా ఎరువులను వాడాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.






## మంథనిలో అక్షయపాత్ర.. విద్యార్థులకు 'అల్పాహార' బాట!


- పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని 694 ప్రభుత్వ పాఠశాలలు, 17 జూనియర్ కళాశాలల్లో
- రూ. 40 వేల మందికి పౌష్టికాహారం అందిస్తున్నాం
- హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం
- ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజా వాయిస్ మంథని** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్'ను మంత్రి సోమవారం వైభవంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ, మంథని పరిసర ప్రాంతాలలోని 19 మండలాలకు చెందిన 40 వేల మంది విద్యార్థులకు ఉదయం పూట బలవర్ధకమైన అల్పాహారాన్ని ఈ కిచెన్ ద్వారా అందజేస్తామని తెలిపారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని 694 ప్రభుత్వ పాఠశాలలు, 17 జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు, అక్కడ విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు కూడా ఈ అల్పాహార సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం ప్రభుత్వం, హరే కృష్ణ ట్రస్ట్ సంయుక్త భాగస్వామ్యంతో పేద పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. విద్యార్థులు పూర్తి ఆరోగ్యంతో ఉంటూ, బాగా చదువుకుని తమ మేధాశక్తిని పెంపొందించుకోవాలనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. మొదట కొడంగల్ నియోజకవర్గంలో ప్రారంభమైన ఈ ఉచిత అల్పాహార కార్యక్రమం నేడు మంథనిలో ప్రారంభమైందని, త్వరలోనే దీనిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీ సత్య గౌర చంద్ర దాస స్వామీజీ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం సొంత జిల్లాలో అక్రమాలు!

- నోటిఫికేషన్ లేకుండానే అతిథి అధ్యాపకుల నియామకాలు?
- కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రకటన లేకుండా పోస్టులు ఎలా భర్తీ చేశారు?
- నిబంధనలకు విరుద్ధంగా మల్టీ జోన్ అభ్యర్థులకు అవకాశం కల్పించారంటూ ఆరోపణలు
- బషీరాబాద్, దౌల్తాబాద్, హకీంపేట్, బొమ్మిరాస్పేట్ కళాశాలల్లో అక్రమాలపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బషీరాబాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల హకీంపేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల బొమ్మిరాస్పేట్, వికారాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇవి వీటిలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వకుండా అక్రమంగా పోస్టులు అమ్ముకోవడం జరిగింది ఇంటర్మీడియట్ బోర్డు నుంచి నోటిఫికేషన్ ఇచ్చి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పోస్టులను ఫిలప్ చేయాలి కానీ జిల్లా అధికారులు , ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు కూడా నోటిఫికేషన్ ఇవ్వకుండా పోస్టులను ఎలా భర్తీ చేస్తారని విద్యార్థి సంఘాల నాయకులు , ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి జిల్లా అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులను (అతిధి అధ్యాపకులను) నియమించారని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన కూడా ఇవ్వలేదు, రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా మల్టీ జోన్ వన్ అభ్యర్థులను, మల్టీ జోన్ 2 లో ఉన్న ప్రభుత్వ



జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు ఎలా నింపుతారని విద్యార్థి సంఘ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించి వికారాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పడిన నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోటిఫికేషన్ వెంటనే ఇచ్చి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతున్నారు లేనిపక్షంలో విద్యార్థి సంఘ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ,పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించడం జరిగింది ఇక్కడ ఉన్న యువతకు తగిన న్యాయం చేయాలని హెచ్చరిస్తున్నారు.

# పినపాక గడ్డపై దద్దరిల్లిన రేగ క్రేజ్



- కోర్టు కేసు కొట్టివేయడంతో గులాబి కార్యకర్తల్లో ఉత్సాహం
- క్యారెక్టరే లేని మహిళతో కేసు పెట్టించి రాజకీయం చేయడం సిగ్గు సేటు
- సొంత తండ్రి పై బాబాయిపై లైంగిక కేసులు పెట్టిన చరిత్ర మహిళది
- గత ఎన్నికల్లో నన్ను ఓడించడానికి రాహుల్ గాంధీ వచ్చాడు
- వచ్చే ఎన్నికల్లో ఐదు నియోజకవర్గాలు గెలిపించే బాధ్యత నాదే
- కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలు అమలు చేయండి
- అక్రమ ఆస్తులు ఉంటే ప్రజలకు పంచడానికి నేను సిద్ధం మీరు సిద్ధమైతే చెప్పండి
- ముగ్గురు మంత్రులకు ఎమ్మెల్యేలకు బహిరంగ సవాల్ విసిరిన రేగ

**ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** కొత్తగూడెం జిల్లా పినపాక మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా రేగా కాంతారావు కు హైకోర్టులో భారీ ఊరట దక్కింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఆయనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును హైకోర్టు కొట్టివేసింది. కాగా ఉద్యోగం ఇప్పిస్తానని టీవీ ఛానల్ ఏర్పాటు చేపిస్తానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని అలాగే ఐదు లక్షల రూపాయలు తీసుకొని తిరిగి ఇవ్వలేదని వేగ కాంతారావు పై యువతి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశారని కాంతారావు హైకోర్టును ఆశ్రయించడం. తనపై పెట్టిన కేసును కొట్టివేయాలి అంటూ క్రాస్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు ఎలాంటి విచారణ చేపట్టకుండానే తనపై కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితానికి వ్యక్తిగత ప్రతిష్టకు దెబ్బతీయాలని ఉద్దేశంతో తప్పుడు ఫిర్యాదు చేశారని నాలుగేళ్ల కింద జరిగినట్లు చెబుతున్న ఘటనపై ఇప్పుడు కేసు నమోదు చేయడం చట్ట విరుద్ధం అన్నారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన హైకోర్టు రేగా కాంతారావు వాదనలు ఏకీభవిస్తూ ఆయనపై నమోదైన తప్పుడు కేసును హైకోర్టు న్యాయమూర్తి కొట్టివేశారు...

### పినపాక గడ్డపై పెరిగిన రేగ క్రేజ్

లైంగిక వేధింపుల కేసులో విజయం సాధించిన రేగ కాంతారావు సోమవారం రోజు పినపాక నియోజకవర్గం లో పర్యటించారు. తన నివాస గృహమైన కరకగూడెం మండలంలో పర్యటన ప్రారంభించిన రేఖ కాంతారావు పినపాక హెడ్ కోటర్ మణుగూరు పట్టణం వరకు కొనసాగడంతో గులాబి కార్యకర్తల్లో నూతన ఉత్సాహం కలిగింది. రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ పార్టీ అక్రమ కేసులు నమోదు చేసినట్లు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రియతమ నేతను కలిసిన కార్య కర్తలు జై రేగా జై బి ఆర్ ఎస్ అంటూ పినపాక గడ్డ దద్దరిలే విజ యోత్సవ ర్యాలీ నిర్వహించారు.

### క్యారెక్టర్ లేని మహిళతో కేసు పెట్టించి రాజకీయం చేశారు...



పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ క్యారెక్టర్ లేని మహిళతో తప్పుడు కేసులు పెట్టించి నా వ్యక్తిగత జీవితానికి భంగం కలిగేలా నా రాజకీయ జీవితాన్ని దెబ్బ కొట్టే విధంగా కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిందని రేగ కాంతారావు ఆవేదన చెందారు. కన్న తండ్రి పై బాబాయిపై లైంగిక వేధింపు కేసులు పెట్టిన మహిళతో నీచ రాజకీయం చెయ్యడం కాదు దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో నన్ను ఓడించే దమ్ముందా అంటూ మంత్రులకు ఎమ్మెల్యేలకు బహిరంగ సవాల్ చేశారు. గత ప్రభుత్వంలో మీలాంటి నీచ రాజకీయాలు చేస్తే నేడు మీ పార్టీ అధికారంలోకి వచ్చేదా అంటూ మండిపడ్డారు. నన్ను అరెస్టు చేసి జైల్లో పెట్టడం మీ తరం కాదు నన్ను జైల్లో పెట్టాలి అంటే నా తలరాత రాసిన బ్రహ్మ దిగి రావాలి అంటూ ధీమా వ్యక్తం చేశారు. 25 రోజులు నేను అజ్ఞాతంలో ఉంటే నన్ను పసిగట్ట డంలో మీరు అట్టర్ ఫ్లాప్ అయ్యింది నిజం కాదా అంటూ ప్రశ్నించారు. నా ఆస్తులపై అక్రమ కేసులు పెట్టడం కాదు. దమ్ముంటే నేను కబ్జాలు చేసినట్టు. పేదల భూములు గుంజుకు న్నట్టు. నిరూపించే సత్తా ఉందా అంటూ బహిరంగ సవాల్ చేశారు.

### నన్ను ఓడించడానికి రాహుల్ గాంధీ వచ్చాడు. ఈసారి ఓడించడం ఎవరితరం కాదు..

2024 సార్వత్రిక ఎన్నికల్లో నన్ను ఓడించే దమ్ము లేకనే రాహుల్ గాంధీతో ప్రచారం చేపించారని రేగా కాంతారావు అన్నారు. తప్పుడు కేసులు పెట్టి వ్యక్తిగత జీవితానికి భంగం కలిగించే కుట్రలు చేయడం నీచ రాజకీయం అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలు అమలు చేసే సత్తా మీలో ఉందా అంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులకు బహిరంగ సవాల్ విసిరారు. బి ఆర్ ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం నేతలను బెది రించడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదు అన్నారు. దమ్ముంటే రెండేళ్లలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక్క ఎమ్మెల్యేని గెలిపించి చూపించండి అంటూ ధీమా వ్యక్తం చేశారు. నేను తెచ్చిన నిధులను ఉపయో గించుకోలేని ముగ్గురు మంత్రులు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభివృద్ధి చేయడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారంటూ రేగ కాంతారావు మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో ఐదు ఎమ్మెల్యే స్థానాలు గెలిపించి టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు గిఫ్టుగా ఇస్తానని ధీమా వ్యక్తం చేశారు...

### నాకు అక్రమ ఆస్తులు ఉంటే నేను ప్రజల పంచడానికి సిద్ధం.. దమ్ముంటే మీ మంత్రులు ఎమ్మెల్యే సిద్ధమా..

కిన్నెర కల్యాణం మండపంలో మీడియాతో మాట్లాడిన రేగ కాంతారావు. సంచలన వ్యాఖ్యలు చేయడం. కార్యకర్తల్లో నూతన ఉత్సాహం కలిగించింది. రేగా కాంతారావు మాట్లాడుతూ 2009లో ప్రజా ఎమ్మెల్యే గా గెలిచిన నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు, ప్రధాన రహదారులు, ప్రాజెక్టులు, తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ నేతలు నాకు అక్రమ ఆస్తులు ఉన్నట్లు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మాకు కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 50 ఎకరాల పట్టా భూములు ఉంటే నేను పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా చేసి నేను సంపాదించింది 15 ఎకరాలు మాత్రమే అన్నారు. ఫారెస్ట్ భూములు ప్రభుత్వ భూములు పేదల భూములు ఆక్రమించి నట్లు. ఎక్కడైనా ఉంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముగ్గురు మంత్రులు నాకు చూపించాలి అన్నారు. నాకు అక్రమ ఆస్తులు ఉంటే ఈ ప్రాంత ప్రజలకు పంచడానికి నేను సిద్ధంగా ఉంటా. మరి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అక్రమంగా సంపాదించిన భూములు పేదలకు పంచడానికి సిద్ధంగా ఉన్నారా అంటూ బహిరంగ సవాల్ చేశారు. నా పేరు పై అక్రమంగా సంపాదించిన భూములు ఉంటే రెవెన్యూ శాఖ మంత్రి గుర్తించాలి అంటూ రేగ కాంతారావు సవాల్ చేశారు. ఎవరికి అక్రమ ఆస్తులు ఉంటే వాళ్లు ప్రజలకు పంచడానికి సిద్ధంగా ఉండాలి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులకు ఎమ్మెల్యేలకు అక్రమంగా సంపాదించిన భూములు ఉన్నాయా లేదంటే నాకు ఉన్నాయో మీరే ఆత్మ పరిశీలన చేసు కోవాలి అన్నాడు. అక్క మా ఆస్తులు ఉంటే నేను పంచడానికి సిద్ధం మీరు సిద్ధంగా ఉండాలి అంటూ పిలుపునిచ్చారు. తదుపరి కార్యకర్తల్లో ఆవేశం పనికిరాదని ఆలోచనతో ముందుకు పోవాలని. ఈరోజు ర్యాలీలో చూపించిన ఉత్సాహం వచ్చే ఎన్నికల్లో చూపిస్తే గెలుపు మనదేనని కార్యకర్తలకు వివ రించారు...

---

## ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి 7, దరఖాస్తులు

### ఎంపీడీవో చిన్నారెడ్డి



**ఆగస్ట్ 24 (ప్రజా వాయిస్) చేగుంట :** చేగుంట మండల కేంద్రంలో ప్రతి సోమవారం నాడు మండల ప్రజా పరిషత్ యందు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం, ప్రజావా ణిలో 07 దరఖాస్తులు వచ్చినవి. 1,రెవెన్యు శాఖా సంబంధించి,5 దర ఖాస్తులు, 2, పంచాయతి రాజ్ డిపార్ట్ మెంట్, 1,3, పోలీస్ డిపార్ట్మెంట్ సంబంధించి 1 ధరఖా స్తులు ప్రజావాణి యందు వచ్చినవి, అట్టి దరఖాస్తులను సంబందిత శాఖా వారికి ప్రజావాణి సైట్ నందు ఉన్నందున, ఇట్టి ప్రజావాణి యందు మండల స్థాయి అధికారులు ఎంపిడి ఓ టి చిన్నారెడ్డి,తహసిల్దార్ బి బాల లక్షి ,మండల వ్యవసాయ అధికారి ఎం హరి ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి,టి నీరజ, మండల పంచాయతీ అధికారి ఏ ప్రకాష్, హౌసింగ్ ఏఈ ఎండి రియాజుద్దీన్,మిషన్ భగీరథ ఏ ఈ ఎం దివ్యశ్రీ ఎలక్ట్రిసిటి ఏఈ యస్ వంశీ, క్రిష్ణ,ఇరిగేషన్ ఏఈ సిద్దార్థ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామల, ఏపీఎం ఆర్ దుర్గా ప్రసాద్,ఎపియం టి శ్వేత, ఏఈపిఆర్ జే అభినవ్, అటవీ శాఖ జె శ్రీవల్లి, మెడికల్ డిపార్ట్మెంట్ ఎం సంపత్,వెటర్నరీ డిపార్ట్మెంట్ బి కావ్య,సోషల్ వెల్ఫేర్ అధికారి కె రమేష్, సోషల్ వెల్ఫేర్ అధికారి ఏ స్వాతి,బీసీ వెల్ఫేర్ అధికారి ఏ శ్రీనివాస్ ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఇట్టి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖ వారు సత్వరమే పరిష్కరించగలరు అని కోర నైనది మరియు ఇట్టి ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1, గంటవరకు నిర్వహించునునారు, ఇట్టి ప్రజావా ణిలో అన్ని డిపార్ట్మెంట్ వారు విధిగా హాజరవు తారు కావున ప్రజల సమస్యలు ప్రజావాణిలో తెలు పగలరనీ వారు తెలిపారు,

---



## వాటర్‌షెడ్ పనులపై విచారణ జరపాలని కలెక్టర్‌కు వినతి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గణం నరసింహ కురుమ

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో వాటర్‌షెడ్ కింద చేపట్టిన కుంటకట్టలు, చెక్‌డ్యామ్‌ల పనులపై సమగ్ర విచారణ జరపాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.గ్రామంలోని సర్వే నంబర్లు 29, 122, 189 పరిధిలో జరిగిన పనుల నిధుల కేటాయింపు, నాణ్యత, ఎంబీ రికార్డులు, ప్రభుత్వ అనుమ తులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో కోడూరు బీరయ్య, బాలగోని మల్లేశ్ గౌడ్, రాచకొండ జంగయ్య, రొమ్ముల సత్తయ్య,శం కరయ్య తదితరులు పాల్గొన్నారు.

---

## నీటి వరదకు కోసుకుపోతున్న పెద్ద చెరువు కట్ట.. పొంచి ఉన్న ప్రమాదం

**ప్రజా వాయిస్ టేక్మాల్:**టేక్మాల్ గ్రామంలోని పెద్ద చెరువు కట్టకు వరద నీటి ఉధృతి కారణంగా కోతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతోంది. భారీ వర్షాలతో చెరువులోకి నీటి ప్రవాహం పెరగ డంతో కట్ట పలు ప్రాంతాల్లో దెబ్బతింటూ, మట్టి కొట్టుకుపోతోంది. దీంతో కట్టకు మరింత నష్టం జరిగితే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పెద్ద చెరువు కట్ట పరిస్థితిపై గతంలో పలుమార్లు వార్త కథనాలు ప్రచురితమైనప్పటికీ గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం ముంచుకొచ్చే వరకు అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని స్థానికులు అంటున్నారు.కట్ట బలహీనంగా మారిన ప్రాంతాల్లో వెంటనే రక్షణ చర్యలు చేపట్టి, అవసరమైన చోట మట్టితో పాటు రాళ్లను ఏర్పాటు చేసి కట్టను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే చెరువు కట్టను అధికారులు స్వయంగా పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాలని టేక్మాల్ గ్రామ ప్రజలు సర్పంచ్, అధికారులను కోరుతున్నారు.



---



## భద్రతకు భరోసా.. నిఘా వలయంలోకి మిర్యాలగూడ

- రూ.3.50 లక్షల వ్యయంతో 25 సీసీ కెమెరాల ఏర్పాటు
- జ్యువెలరీ అసోసియేషన్ చొరవకు పోలీసు శాఖ అభినందనలు
- దొంగతనాలు, నేరాల నియం త్రణకు మరింత పటిష్ట నిఘా.
- కెమెరాలను ప్రారంభించిన డిఎస్పి రవి, వన్ టౌన్ సీఐ నాగభూషణం రావు.

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:**మన ఊరి రక్షణే లక్ష్యంగా మిర్యాలగూడ పట్టణంలో భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా మరో ముందడుగు పడింది. మిర్యాలగూడ పట్టణ జ్యువెలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.3,50,000 వ్యయంతో ఏర్పాటు చేసిన 25 సీసీ కెమెరాలను మిర్యాలగూడ డిప్యూటీ సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ జి. రవి, మిర్యాలగూడ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు ప్రారం భించారు.పట్టణంలోని జ్యువెలరీ దుకాణాలు, వాటి పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడం, దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ సీసీ కెమెరా లను ఏర్పాటు చేశారు. నేరాలు జరిగిన సందర్భాల్లో కీలక ఆధారాలను సేకరించడంతో పాటు, నేరస్తులను గుర్తించడంలో ఈ నిఘా వ్యవస్థ ఎంతో ఉపయోగపడనుంది.ప్రజల భద్రతతో పాటు వ్యాపార సంస్థల రక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పోలీసు అధి కారులు తెలిపారు. పట్టణ భద్రతను కేవలం పోలీసు శాఖ బాధ్యతగా కాకుండా, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి జ్యువెలరీ అసోసి యేషన్ ముందుకు రావడం అభినందనీయమ న్నారు.పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ మిర్యాలగూడను మరింత సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు జ్యువెలరీ అసోసియేషన్ చేస్తున్న కృషిని అధికారులు అభినందించారు. ప్రజలు–వ్యాపారులు–పోలీసులు కలిసి పనిచేస్తేనే నేరాలపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవు తుందని, “మన ఊరి రక్షణే లక్ష్యం” అనే భావనతో ప్రతి ఒక్కరూ భద్రతలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు...

---

## బాధితుల సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వర చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:** నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సోమవారం జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 32 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను సవివ రంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలిం చిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరి ష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.



---

## రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రెవెన్యూ అధికారులు

- ల్యాండ్ కన్వర్షన్, పౌతీ వ్యవ హారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
- జీపీవో అహ్మద్, ఆర్ ఐ పూర్ణ చందర్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ
- రెండు రోజుల నిఘా అనంతరం ఆలేరు తహసీల్దార్ కార్యా లయంలో దాడులు





**ప్రజా వాయిస్ / ఆలేరు:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి, రూ.14 వేల లంచం తీసుకుంటున్న ఇద్దరు రెవెన్యూ అధికారు లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకు న్నట్లు సమాచారం.కోలను పాక ప్రాంతంలో భూ కన్వర్షన్, అలాగే ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన మహేష్ తన తండ్రికి చెందిన 8 ఎకరాల భూమి పౌతీకి సంబంధించిన వ్యవహారంలో అధికా రులు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పనికి తొలుత రూ.20 వేల లంచం డిమాండ్ చేయగా, అంత మొత్తం ఇవ్వ లేనని మహేష్ చెప్పడంతో చివరికి రూ.14 వేలు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది.దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రెండు రోజుల పాటు నిఘా నిర్వహించారు. అనంతరం ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో లంచం నగదు తీసుకుంటుండగా జీపీవో అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ కొనసా గిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మురుగు కూపంలో సింగిరెడ్డిపల్లి!

- ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు..
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి
- అధికారుల నిర్లక్ష్యంపై ఎంపీడీఓ కి గ్రామస్తుడి ఫిర్యాదు

**ప్రజా వాయిస్ రామగిరి**

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సింగిరెడ్డిపల్లి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ గ్రామానికి చెందిన రేనుకుంట్ల నరేష్ సోమవారం రామగిరి ఎంపీడీఓ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇళ్లలోకి వర్షపు నీరు.. పెరిగిన దోమల తీవ్రత రామగిరి మండలం జిల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామంలో




సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి ఇళ్లలోకి చేరుతోంది. నిల్వ ఉన్న మురుగునీటి వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి ఈ తీవ్రమైన సమస్యపై గత ఏప్రిల్ (02-04-2026) నెలలోనే పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు నరేష్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. గ్రామంలో వెంటనే విచారణ జరిపి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అలాగే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# తొర్రూర్ మండలం లో ఆహార భద్రత స్మార్ట్ కార్డుల పంపిణీ

**తొర్రూర్ ప్రజా వాయిస్...**

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలో లబ్ధిదారులకు ఆహార భద్రత స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తొర్రూర్ పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమై శరవేగంగా



కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే ఆడిటోరియం పనులు పూర్తయ్యాయని, మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి కోసం అధిక నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. తొర్రూర్ పట్టణంలోని సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇక ప్రతిపక్ష నాయకుల విమర్శలపై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి స్పందిస్తూ.. ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి జరగడం లేదంటూ, ఎమ్మెల్యే స్థానికంగా ఉండడం లేదంటూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**ప్రజావాణి కార్యక్రమంలో పలు మండల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, ఏవో బి. ప్రకాష్**

**ప్రజా వాయిస్ పెద్దపల్లి**

ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏ. ఫాతిమా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పీడీ హౌసింగ్‌కు సూచించారు. పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గేట్ గ్రామానికి చెందిన ధర్మపురి శిరీష ఏఎన్ఎమ్ పూర్తి చేశానని, కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని విన్నవించగా వారధి సొసైటీకి పంపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన బర్ల బాపు సర్వే నంబర్ 119లోని 2 ఎకరాల 25 గుంటల భూమికి పట్టా ఇప్పించాలని దరఖాస్తు చేయగా, విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ముత్తారం తహసిల్దార్‌ను ఆదేశించారు. పెద్దపల్లి మండలం బందారికుంటకు చెందిన నేరెళ్ల లత వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, నిబంధనల ప్రకారం నూతన పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారానికి ఆదేశం



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిర్పూర్ (టి) మండలానికి చెందిన షకీల్ హుస్సేన్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ సప్లై బిల్లుల చెల్లింపు కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం దూరాతండా గ్రామస్తులు తమ గ్రామ ఆశా కార్యకర్తను తొలగించాలని కోరారు. రెబ్బెన మండలం గోనేటి గ్రామ రైతులు తమ ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో వేసిన బోర్లకు విద్యుత్ సరఫరా కోరారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన మసాడె అరుణ్ తన కుమారుడికి గురుకుల విద్యాలయంలో సీటు కోరారు. దహేగాం మండలం కమ్మరపల్లికి చెందిన జరుపుల సురేష్ తండ్రి పేరిట గల భూమిని తన పేరిట వారసత్వ మార్పిడి కోరారు. పెంచికలపేట మండలం గుండెపల్లికి చెందిన తలండి ముత్తుబాయి తాము సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి పట్టా మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు.

## వన మహోత్సవం లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

**మంత్రి కొండా సురేఖ**



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి పీసీసీఎఫ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2026-27 సీజన్‌లో జిల్లాలకు కేటాయించిన లక్ష్యాల ప్రకారం మొక్కలు నాటే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి సంరక్షించాలని, బృహత్ పల్లె వనాల్లో మొక్కలు పెంచాలని మంత్రి సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణి సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాకు కేటాయించిన 47 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని అధికారుల సమన్వయంతో త్వరలో పూర్తి చేస్తామని, ప్రభుత్వ స్థలాలు, రహదారికి ఇరువైపులా, చెరువుగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలియజేశారు



## తుక్కాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**లబ్ధిదారులకు మెరుగైన సేవలు**

**ప్రజా వాయిస్ తోగుట**

తోగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతినిధులు, అధికారులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిక్కుడు (మాస్టి) కళావతి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు సమర్థవంతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ లబ్ధిని నేరుగా చేరవేయడంలో రేషన్ కార్డులు అత్యంత కీలకమైన సాధనంగా ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని, లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరుకులను సులభంగా పొందే అవకాశం ఉంటుందని కళావతి పేర్కొన్నారు. గ్రామంలో అర్హత ఉండి కూడా సాంకేతిక కారణాలు లేదా ఇతర సమస్యల వల్ల కార్డులు అందని వారి వివరాలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన మొదటి వార్డ్ మెంబర్ సుబ్రహ్మణ్య చారి

**ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు**

**ప్రజా వాయిస్.. వనపర్తి**

వర్షాకాలంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తిస్తూ వనపర్తి జిల్లా వీపనగండ్ల గ్రామానికి చెందిన మొదటి వార్డ్ మెంబర్ సుబ్రమణ్యాచారి జర్నలిస్టులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే జర్నలిస్టులు వర్షం, ఎండ వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే జర్నలిస్టులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వార్తా సేకరణ చేస్తూ ప్రజా సమస్యలను సమాజం దృష్టికి తీసుకువస్తున్నారు. వారి విధులకు చిన్న సహకారంగా ఈ రెయిన్‌కోట్లను అందజేస్తున్నాం” అని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, తమ వృత్తిపట్ల గౌరవంతో రెయిన్‌కోట్లు అందజేయడం అభినందనీయమని, వర్షాకాలంలో వార్తా సేకరణకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరేష్ కుమార్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ నరసింహ జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి క్రీడలకు గట్టేపల్లి విద్యార్థినులు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**

సుల్తానాబాద్‌లో ఆగస్టు 22న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గట్టేపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జడ్పీహెచ్ఎస్ గట్టేపల్లికి చెందిన హాఫ్సా ఐమెన్ అండర్-14 రన్నింగ్ విభాగంలో, జోయ అండర్-14 జావెలిన్ త్రో విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, జడ్పీహెచ్ఎస్ గట్టేపల్లి హెచ్ఎం వి.అన్నపూర్ణ, పీడీ ప్రణయ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# పశువైద్యులను నియమించి గ్రామాల్లో సేవలు అందించాలి..

**ప్రభుత్వం వెంటనే వెటర్నరీ వైద్యులను నియమించాలి**

**పశువులు, గొర్రెలు మేకల పై ఆధారపడి జీవిస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించాలి**



ప్రజా వాయిస్.. వనపర్తి
వనపర్తి జిల్లావీపనగండ్ల మండలంలోని పలు గ్రామాల్లో పశువులు, మేకలు, గొర్రెలు, తదితర మూగజీవాలు అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఏడాది గొర్రెలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామ రైతు ముంత శివ యాదవ్ సోమవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు .పశువులకు, గొర్రెలు మేకలకు సకాలంలో వైద్యం అందకపోవడంతోనే అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలకు కనీస ప్రాథమిక పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం వెంటనే వెటర్నరీ వైద్యులను నియమించాలని కోరుతున్నారు.వెటర్నరీ వైద్యులు గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, టీకాలు అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. పశువుల, గొర్రెలు మేకలపై పై ఆధారపడి జీవిస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# పన్నూర్‌లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**- ప్రతి కుటుంబ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**- సర్పంచ్ చిందం మహేష్**



ప్రజా వాయిస్ రామగిరి
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన 787 స్మార్ట్ రేషన్ కార్డులను వన్నూర్ సర్పంచ్ చిందం మహేష్ శుక్రవారం ఘనంగా పంపిణీ చేశారు. సమగ్ర ప్రజావాణి, ప్రజా పాలన కార్యక్రమాల్లో భాగంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈ కార్డులను అందజేశారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ చిందం మహేష్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కొత్తగా వచ్చిన 787 స్మార్ట్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులతో పాటు ఇతర ప్రభుత్వ ఫలాలు కూడా పారదర్శకంగా, సులభంగా అందుతాయని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, జి.పి.ఓ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కావేటి మల్లేశ్వరి, రేషన్ డీలర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు సుధాకర్, ప్రదీప్, మున్ని రమాదేవి, మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, కమాన్‌పూర్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ సిద్ధం మురళీకృష్ణ, గుగులోత్ ప్రవీణ్ కుమార్, సుందిళ్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం డైరెక్టర్ నరెడ్ల శ్రీనివాస్, మోత్కూరి నవీన్ గౌడ్, కుంట శ్యామ్, నాగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా ఫోరం జగిత్యాల జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో పద్య పఠన పోటీలు

**పద్య పఠన పోటీ లకు సన్నద్ధం అవుతున్న విద్యార్థిని విద్యార్థులు**



**ధర్మపురి, ఆగస్టు 24 (ప్రజా వాయిస్) :**
జగిత్యాల జిల్లా భాషోపాధ్యాయులు మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ భాషా దినోత్సవ శుభ సందర్భంగా.. తెలుగు భాషకు ఆయుపట్టు పద్యమే అని, తెలుగు భాషా సోగసుకు శిఖరాగ్రమైన ప్రక్రియనే పద్య సాహిత్యమే అని, విద్యార్థిని విద్యార్థులకు పద్యం పైన మక్కువ పెంచడానికి, పద్యం విశిష్టతను, రసానుభూతిని తెలియజేయుటకై తెలుగు భాషా ఫోరం జగిత్యాల జిల్లా శాఖ వారు పద్య పఠన పోటీలను నిర్వహించనున్నారు. 6వ, 7వ తరగతులు జూనియర్స్ విభాగం అని, 8వ, 9వ,10వ తరగతుల వారు సీనియర్స్ విభాగాలలో సెప్టెంబర్ 2వ తేది బుధవారం రోజు మండల స్థాయి పోటీ లతో పాటు, సెప్టెంబర్ 8వ తేది మంగళవారం రోజు జగిత్యాల జిల్లా స్థాయిలో పద్య పఠన పోటీ లను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలుగు భాషా ఫోరం అధ్యక్షుడు శేషగిరి, ప్రధాన కార్యదర్శి గంగాధర్ లతో పాటు, కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించి పద్య పోటీ లను గురించి మీడియాకు సోమవారం రోజు మధ్యాహ్నం వేళలో వారు మీడియాకు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, తెలుగు భాషా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

**మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**2026-27 సంవత్సరానికి హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం**

**తొలి హెల్త్ కార్డు అందుకున్న సీనియర్ అడ్వకేట్ లింగంపల్లి అంజయ్య**

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:**
మిర్యాలగూడ కోర్టు ప్రాంగణంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి న్యాయవాది హెల్త్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తూ, వారి ఆరోగ్య భద్రతకు రక్షణగా నిలుస్తున్నట్లు తెలిపారు. 2026-27 సంవత్సరానికి కూడా న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కొనసాగించిన నేపథ్యంలో హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్డుల ద్వారా అనారోగ్యం లేదా అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైన సమయంలో న్యాయవాదులు ఆందోళన చెందాల్సిన అవసరం



లేకుండా, అర్హత మేరకు మెరుగైన వైద్య సదుపాయాలను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ లింగంపల్లి అంజయ్య తొలి హెల్త్ కార్డును అందుకొని ఆనందం వ్యక్తం చేశారు. హెల్త్ కార్డుల ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కూడా వైద్య సేవలు పొందే అవకాశం ఉండటం న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరమని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఈసరం కరుణాకర్, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు మట్టయ్యదుపాటి, గూడూరు శ్రీనివాస్, ధనావత్ రాజశేఖర్, డి. బాలునాయక్, అలాగే గొడ్డటి సాయికుమార్ యాదవ్, మస్తాన్ అలీ, ఎం.డి. ఇక్బాల్, పేయ్యల ప్రసాద్, విగ్రహాల సుధాకర్, కొంక వెంకన్న తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# కల్వచర్లలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ మహా శిబిరం

**- భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా నిర్వహణ**

**- 116 మందికి పూర్తి చేసిన వైద్య పరీక్షలు**

ప్రజా వాయిస్ రామగిరి
భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. కల్వచర్ల శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్, విశ్రాంత సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ నూక రమేష్ స్వగృహం 'సాయి నిలయం' నందు భగవాన్ పూజా కార్యక్రమంతో ఈ శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి అడ్రియాల ప్రాజెక్టు ఏరియా



జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఎం.ఎన్.జే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్ నుండి డాక్టర్ విజయ్ కుమార్ బృందం, క్యాంపు కోఆర్డినేటర్ సి.ఎస్. ప్రసాద్, స్టాఫ్ నర్సులు సంతోషి, రేవతి, దంత వైద్యులు జి. సాయితేజ వైద్య సేవలందించారు. ఈ శిబిరంలో మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా (సర్వికల్) క్యాన్సర్ మరియు పురుషులకు నోటి క్యాన్సర్ సంబంధిత పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 53 మంది మహిళలు, 63 మంది పురుషులు - మొత్తం 116 మంది గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు వెంకటస్వామి, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ హనుమంతరావు, కల్వచర్ల సర్పంచ్ శారద కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ రమణారెడ్డి, పెద్దపల్లి 8వ కాలనీ సమితి కన్వీనర్లు వేంకటేశం, కటుకూరి శ్రీనివాస్ రెడ్డి, భక్త బృందం సభ్యులు కాంటేవాడ బుగ్గాజీ, గరిగంటి రాజం, కొండ సమ్మయ్య, కొలిపాక సారయ్య, తోట ప్రసాద్, సదాశివ రెడ్డి, కిష్టయ్య, తాటిపాముల రాజ్యలక్ష్మి శ్రీనివాస్, భాస్కర్, స్వరూప, నూక వాణి, పెరుమాల్ సరవణన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి..

**ప్రజావాణిలో డాక్టర్ వేల్పుల శంకర్ విజ్ఞప్తి.**


**నాణ్యమైన పురుగుమందులు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్.**

**కోహెడలో ప్రమాదకరంగా మారిన నునుపు సీసీ రోడ్డుకు శాశ్వత పరిష్కారం కోరిన సామాజిక కార్యకర్త.**

ప్రజా వాయిస్, కోహెడ.
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, రైతులకు నాణ్యమైన పురుగుమందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతమంది ఫర్టిలైజర్ దుకాణదారులు పంటల సమస్యలపై పూర్తి అవగాహన లేకుండానే రైతులకు మందులు విక్రయిస్తున్నారని, దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని డాక్టర్ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పంటకు ఏ రకమైన మందు ఉపయోగించాలి, ఎంత మోతాదులో వినియోగించాలనే అంశాలపై రైతులకు శాస్త్రీయంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల వారీగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఫర్టిలైజర్ దుకాణాల్లో జరుగుతున్న మందుల విక్రయ రికార్డులను అధికారులు క్రమం తప్పకుండా




పరిశీలించాలని సూచించారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఆయన కోరారు. అనంతరం కోహెడ మండల కేంద్రంలో ప్రమాదకరంగా మారిన నునుపు సీసీ రహదారి సమస్యను ప్రజావాణిలో ప్రస్తావించారు. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. గతంలో నిర్వహించిన 'డై యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. గత సోమవారం నిర్వహించిన ప్రజావాణి సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారి అందుబాటులో లేకపోవడంతో, ఈసారి అధికారి హాజరైన సందర్భంగా ఎంపీడీవో సమక్షంలో రహదారి సమస్య తీవ్రతను మరోసారి వివరించినట్లు డాక్టర్ వేల్పుల శంకర్ తెలిపారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ అధికారి స్పందిస్తూ, నునుపు సీసీ రహదారి సమస్య ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందని, పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని సానుకూల హామీ ఇచ్చినట్లు శంకర్ పేర్కొన్నారు. రైతుల సమస్యలతో పాటు రహదారి సమస్యపై సానుకూలంగా స్పందించిన అధికారులకు, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ డాక్టర్ వేల్పుల శంకర్ ధన్యవాదాలు తెలిపారు.



Citizen Copy

GOVERNMENT OF TELANGANA

Koheda Mandal Prajavani Acknowledgment


Grievance ID: [illegible] Grievance Date: [illegible]
Citizen Name: VELPULA SHANKAR Mobile No.: [illegible]
Gist of Grievance: [illegible]

Your Grievance has been forwarded to the AE Roads & Buildings - Koheda for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required

# గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

***ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్***





**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో గిరిజన సమస్యలు అధికంగా ఉన్నాయని, ఈ ప్రాంత గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కి జూలూరుపాడు బిజెపి మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎలమంద నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గిరిజన సమస్యలు అధికంగా ఉన్నాయని అన్నారు. ఆ సమస్యలను రాతపూర్వకంగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తమ సమస్యలు విన్నవించేందుకు గిరిజన ప్రజలు నేరుగా నన్ను కలవచ్చునని తెలిపారు. గిరిజన నాయకులు మండలంలోని వివిధ సమస్యల పై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ రాథోడ్, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, బిజెపి మండల అధ్యక్షుడు భూక్య రమేష్, సిరిపురపు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శులు భూక్య శ్రీను, నిమ్మటూరు రామారావు, ధారావత్ బాలకిషన్, గుగులోతు రాంబాబు, భూక్యచరణ్, బాబూలాల్, భూక్య రవి, కిష్టంశెట్టి గోపాలరావు, నవీన్, పృథ్వి, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల బంజరు దొడ్డి కూల్చివేతపై రైతుల ఆవేదన

## బంజరు దొడ్డి లేక రైతులకు తీవ్ర ఇబ్బందులు

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలములోని బట్వాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రైతులు పంటలు వేసిన తర్వాత ఆవులు, ఇతర పశువులు పొలాల్లోకి వెళ్లి పంటలను మేయకుండా వాటిని ఉంచేందుకు ఉపయోగపడే పశువుల బంజరు దొడ్డిని నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో రైతులు పంటలు వేసిన తర్వాత పశువులు పొలాల్లోకి వెళ్లి పంటలను మేస్తే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో పశువులను బంజరు దొడ్డిలో ఉంచుకునే అవకాశం ఉండేదని, అయితే ప్రస్తుతం ఆ దొడ్డిని కూల్చివేయడంతో పశువులను ఎక్కడ ఉంచాలో, ఎక్కడ కట్టాలో అర్థం కాక రైతులు ఇబ్బందులు



పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామానికి ఉపయోగపడుతున్న పశువుల బంజరు దొడ్డిని ఎందుకు కూల్చివేశారని గ్రామస్థులు ప్రశ్నించగా.. "మా ఇష్టం.. మీరు ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి" అంటూ సమాధానం ఇచ్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాలకు సంబంధించిన దొడ్డిని కూల్చివేసే ముందు గ్రామస్థులకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు ఇప్పటికే డీపీవో, ఎంపీడీవో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పశువుల బంజరు దొడ్డిని తిరిగి నిర్మించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంజరు దొడ్డి కూల్చివేతపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డీపీవో, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, పశువుల బంజరు దొడ్డిని తిరిగి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఈ నెల 25న డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు

**పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక**

**తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ**

**మందమర్రి, ఆగస్టు 24.**

మందమర్రి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రకటించిన అర్హుల జాబితా ఆధారంగా ఈ నెల 25న ఉదయం 10 గంటలకు సండ్రోన్‌పల్లి గ్రామ పరిధిలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నామని




తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లలోని బ్లాక్, ఫ్లోర్ కేటాయించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు మాత్రమే హాల్ లోకి అనుమతి ఉంటుందని, ఇతరులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. కేటాయింపు అనంతరం లబ్ధిదారుల్లో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందితే సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేయడంతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, నిజమైన అర్హులకు ఇళ్లు దక్కేలా చూడాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# భద్రాద్రి జిల్లాలో జాతీయ ఎస్టీ కమిషనర్ పర్యటన

**గిరిజనుల హక్కులను కాపాడుతూ.. అటవీని సంరక్షించాలి**

**అంబాసత్రం భూమిని గుర్తించి 15 రోజుల్లో స్పష్టతకు చర్యలు**

**అటవీ-రెవెన్యూ భూ సమస్యలకు సమగ్ర సర్వేతో పరిష్కారం చూపాలి**

**జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్**



**ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కూనారం గ్రామంలో అటవీ-రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ క్షేత్రస్థాయిలో పర్యటించి భూ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గిరిజనులు, స్థానిక ప్రజలు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా భూ సమస్యలపై తుది నిర్ణయానికి రావడం సరికాదన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులు, వాదనల్లో భిన్నతలు ఉన్న నేపథ్యంలో గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని సూచించారు. పాత సర్వేకు, తాజా జాయింట్ సర్వేకు మధ్య తేడాలు ఎందుకు వచ్చాయో స్పష్టంగా తేల్చాలన్నారు. అంబాసత్రం భూమికి సంబంధించిన అంశంపై కూడా స్పష్టత తీసుకురావాలని కమిషన్ సభ్యులు సూచించారు. గతంలో సుమారు 250 ఎకరాలకు పైగా అంబాసత్రం భూమి ఉన్నట్లు అధికారులు విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఆ భూమి రికార్డుల్లో స్పష్టంగా కనిపించకపోవడానికి కారణాలను పరిశీలించాలన్నారు. అంబాసత్రం భూమి ఎక్కడ ఉందో గుర్తించి, ఓవర్‌ల్యాప్ అయిన ప్రాంతాలను కూడా మరోసారి సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టతకు చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని జాటోత్ హుస్సేన్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో పిటిషనర్లు, సంబంధిత భూ హక్కుదారులు, గ్రామస్తులు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల ప్రతినిధులు సమక్షంలో ప్రక్రియ నిర్వహించాలని, సంబంధిత వ్యక్తుల సంతకాలు, వాంగ్మూలాలు నమోదు చేయాలని సూచించారు. న్యాయస్థానాలకు నివేదికలు సమర్పించే సమయంలో సర్వే ప్రక్రియకు సంబంధించిన పూర్తి ఆధారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల జీవనోపాధి ప్రధానంగా భూమి, అడవులపైనే ఆధారపడి ఉంటుందని, వారి హక్కులను పరిరక్షిస్తూ అటవీ సంరక్షణకు చర్యలు చేపట్టాలని జాటోత్ హుస్సేన్ అన్నారు. అటవీ శాఖ అధికారులు గిరిజనులతో స్నేహపూర్వకంగా, సమన్వయంతో పనిచేయాలని, అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల జీవనోపాధి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం, ఇతర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజనులకు భూ హక్కులు, ప్రభుత్వ పథకాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అన్నారు . నీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు వ్యవసాయం, ఉద్యాన పంటలు, కాఫీ, టీ తదితర ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలపై కూడా ప్రోత్సాహం అందించాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ**

కూనారం గ్రామానికి సంబంధించిన భూ సమస్యపై గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. జాయింట్ సర్వేకు ముందు, అనంతరం నిర్వహించిన సర్వే వివరాలతో పాటు రెవెన్యూ, అటవీ శాఖల వద్ద ఉన్న రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, సర్వే అధికారులు, అటవీ శాఖ అధికారులు అందుబాటులో ఉన్న రికార్డులు, మ్యాపులు, సర్వే నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా పరిశీలించి తుది నిర్ధారణకు రావాలని కలెక్టర్ సూచించారు. పాత సర్వేలు, తాజా జాయింట్ సర్వే, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి తుది నివేదిక రూపొందిస్తామని తెలిపారు. దమ్మపేట, కరకగూడెం, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో కూడా ఇలాంటి అటవీ-రెవెన్యూ భూ సమస్యలు ఉన్నాయని కలెక్టర్ అన్నారు . ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే జాయింట్ సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే ఆరు నుంచి ఏడు నెలల్లో ఆయా సమస్యలపై స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూనారం సమస్య చాలా కాలంగా కొనసాగుతున్నందున దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం



చేశారు.

**జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ**

కమిషన్ సభ్యులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత ఫైళ్లు, రికార్డులను పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 60 శాతం వరకు అటవీ ప్రాంతం ఉందని, అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కూనారం సమస్యకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, అటవీ శాఖలు, గ్రామ పాలనా సిబ్బందితో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కమిటీ 7 మార్చి 2026న నివేదిక సమర్పించిందని, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సంబంధిత భూమి అటవీ భూమిగా ఉన్నట్లు నివేదికలో తెలిపినట్లు వివరించారు. ప్రస్తుతం అంబాసత్రం భూమికి సంబంధించిన అంశం కూడా వెలుగులోకి వచ్చినందున, దీనిపై మరోసారి సమగ్రంగా పరిశీలించి రికార్డులు, చట్టపరమైన అంశాలు, జాయింట్ సర్వే ఫలితాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ**

కూనారం గ్రామంలోని భూ సమస్య గత ఐదారు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని పోడు భూములకు ఇప్పటికే పట్టాలు మంజూరైనప్పటికీ, నిర్దిష్ట సర్వే నంబరుకు సంబంధించిన భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందా లేదా అటవీ శాఖ పరిధిలోకి వస్తుందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఈ ఏడాది కూడా సంబంధిత భూమిపై జాయింట్ సర్వే నిర్వహించినట్లు ఐటీడీఏ పీవో తెలిపారు. అయితే సర్వే అనంతరం కూడా కొన్ని అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తమవుతున్నందున జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓతో చర్చించి సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు. భూమి రెవెన్యూ భూమిగా నిర్ధారణ అయితే అందుకు అనుగుణంగా, అటవీ భూమిగా నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. ఈ పబ్లిక్ హియరింగ్ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు తాసిల్దార్ శిరీష రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులు, సర్వేయర్లు, గ్రామస్థులు, గిరిజనులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో కాలబైరవ విగ్రహ ప్రతిష్ఠకు విరాళం అందించిన జోగిని భవాని మాత చౌదరి

**ప్రజావాయిస్ / పాలకుర్తి:**

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కాలభైరవ స్వామి విగ్రహ ఏర్పాటు కోసం నిత్యం దైవచింతన, సమాజ సేవలో తరించే ప్రముఖ జోగిని జోగిని భవాని మాత చౌదరి గారు రూ. 78,001 ఆర్థిక సహాయాన్ని విరాళంగా అందించారు. ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ, దైవ కార్యాలకు తనవంతు సహకారం అందిస్తున్న భవాని మాత చౌదరి గారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఈ విరాళాన్ని అందజేశారు. ఆలయంలో కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఎంతో విశిష్టమైనదని, భక్తులందరికీ ఆ దేవుడి ఆశీస్సులు లభించాలనే సంకల్పంతో ఈ విరాళం అందజేసినట్లు ఆమె తెలిపారు. నిత్యం ఆధ్యాత్మిక సేవలు, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ దైవసేవలో తరిస్తున్న భవాని మాత ఔదార్యాన్ని, భక్తిభావాన్ని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మరియు స్థానిక గ్రామ ప్రజలు కొనియాడారు.



# నారాయణపురం లో ప్రభుత్వ భూములు స్వాధీనం

## ఆక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు



**ప్రజావాయిస్:సంస్థాన్ నారాయణపురం**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి కందకాలు తవ్వినట్లు గుర్తించిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. జేసీబీల సహాయంతో ఆక్రమణ దారులు తవ్విన కందకాలను పూడ్చివేసి, భూమిని పూర్తిగా చదును చేసి స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ... గ్రామ పరిధిలోని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను ఎవరైనా కబ్జా చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ప్రజలంతా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

## - ఇజారా చిట్టంపల్లిలో ఎస్‌బీఐ ఆర్‌సెటి అవగాహన సదస్సు



**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**

గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎస్‌బీఐ ఆర్‌సెటి ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని ఇజారా చిట్టంపల్లి తండాలో ఉచిత స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ వందన విజయ్ మాట్లాడుతూ యువత, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఎస్‌బీఐ ఆర్‌సెటి డైరెక్టర్ మహ్మద్ అలీ ఖాన్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7 నుంచి సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి, ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందించడంతో పాటు బ్యాంకు రుణాల ద్వారా స్వయం ఉపాధికి సహకరిస్తామని చెప్పారు. మహిళలకు కుట్టు, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్ తదితర కోర్సుల్లోనూ ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణపై తండా యువత, మహిళలు విశేష ఆసక్తి కనబరిచారు. ఆసక్తి ఉన్న వారు 7981951167 నంబర్‌ను సంప్రదించవచ్చు.



# అనారోగ్య బాధతో యువతి ఆత్మహత్య

**వాస్తవ గమ్యం ఆసిఫాబాద్ ఆగస్టు 24:**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణం తైబా నగర్‌కు చెందిన సుమాయా మహేక్ (18) అనారోగ్య బాధతో ఆత్మహత్యకు పాల్పడింది. గత నాలుగు నెలలుగా రక్తహీనత, కడుపునొప్పి సమస్యలతో చికిత్స పొందుతున్నా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యుల సమాచారం. తేదీ 23-08-2026న సాయంత్రం 18:20 గంటల ప్రాంతంలో తల్లి పక్కింటికి వెళ్లిన సమయంలో సుమాయా పడకగదిలో ప్రాణాలు తీసుకుంది. కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగువారు ఆమెను వెంటనే కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు రాత్రి 19:15 గంటలకు మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు 24-08-2026న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మృతిపై ఎటువంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమాయా మహేక్ (మృతురాలు), కుటుంబ సభ్యులు, కాగజ్‌నగర్ పోలీసులు పాల్గొన్న వారు

# నీళ్ల కోసం బయలుదేరిన నాయకులు..

**గోదారి జలాలు తులారం చేర్చుట కొరకు..**
**అభివృద్ధి కోసం అలుపెరుగని పోరాటం చేస్తాం..**
**కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి..**



**ప్రజా వాయిస్ బయ్యారం..**
బయ్యారం మండలంలోని ప్రజా ప్రతినిధులు బయ్యారం పెద్ద చెరువు మరియు తులారం ప్రాజెక్టుకు గోదావరి నీళు తరలించి ఈ ప్రాంత రైతాంగానికి రెండు పంటలకు నీళు అందించే విధంగా ఎమ్మెల్యే తీసుకున్న చర్యల్లో భాగంగా ఈరోజు మరో మారు ఎమ్మెల్యే నాయకత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రివర్యులు మరియు పంచాయతీలో సీతక్క రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఎంపీ బలరాం నాయక్ కలిసి ఈ ప్రాంతంలోని నీటి సమస్యను తలుపునున్నారు.అలాగే గ్రామాలలో నెలకొన్న అనేక సమస్యల్ని పరిష్కారం చేసే దిశగా నిర్ణయం త్వరగా తీసుకోవాలని 2027 బడ్జెట్లో గోదావరి జలాలను తరలించే వ్యాయాన్ని ఈ బడ్జెట్ లో పొందపరిచే విధంగా మరియు కాలువలకు లైనింగులు ఏర్పాటు చేయుటకు గత బడ్జెట్ లోనే 50 కోట్ల రూపాయలు ఉంచినట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసినదే కాలువల మనుమతులకు అయ్యే వంద కోట్లలో ఈ సంవత్సరం 50 కోట్లు వచ్చే సంవత్సరం 50 కోట్లు మంజూరు చేసే విధంగా మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం జరిగినదని ఇట్టి జీవోను కూడా వెంటనే జారీ చేయాలని కోరారు. అదేవిధంగా బయ్యారం చెరువు నుండి ఏజెన్సీ గ్రామాలలోని అన్ని చెరువులు కుంటలకు లిఫ్టుల ద్వారా నీటిని నింపాలని అవకాశం ఉన్నచోట చెక్ డాములు నిర్మాణం, 29 గ్రామపంచాయతీలకు సంబంధించిన అంతర్గత రహదారులు లింకు రోడ్లు మంచినీటి సమస్య బతుకమ్మ గాట్లు నిర్మాణం కొరకు ఎదురు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.. హైదరాబాద్ బయలుదేరే ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జూలకంటి సీతారాం రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు డైరెక్టర్ వేల్పుల శ్రీనివాస్, గంధంపల్లి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ గారు, ఎస్పీ తండా సర్పంచ్ మనీ భాస్కర్ గారు, కస్తూరి నగరం సర్పంచ్ రవి నాయక్ గారు, కోయగూడం సర్పంచ్ లింగా నాయక్ ఇర్సులాపురం సర్పంచ్ ఎట్టి సరోజిని, మిరియాల పెంట సర్పంచ్ కవితా శ్రీనివాస్, ఇసుకమీద సర్పంచ్ కృష్ణకుమారి, ఉప్పలపాడు సర్పంచ్ వెంకన్న, సర్పంచ్ ప్రేమ రామచంద్రపురం సర్పంచ్ గుగులోత్ వనిత మంగీలాల్, చర్లపల్లి సర్పంచ్ బాలకృష్ణ మిర్యాల పెంట సర్పంచ్ కవితా శ్రీనివాస్, బాలాజీ పేట సర్పంచ్ మాలోత్ పార్వతి , ఉప సర్పంచ్లు రాకేష్ గారు అనిల్ , చాగర్లమూడి భాస్కర రావు, తెల్లం బిక్షం, తిరుమల ప్రభాకర్ రెడ్డి పార్టీ నాయకులు, ఎట్టి నాగేశ్వరావు , వీర్నేని వెంకటేశ్వరరావు , నరసింహారావు గుగులోత్ సేవాలాల్ తదితరులు ఉన్నారు..



## ప్రజావాణి లో 02 ఫిర్యాదుల స్వీకరణ.

**అర్జీదారులతో స్వయంగా మాట్లాడిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్.**

**ప్రజా వాయిస్, నాగర్ కర్నూల్.**
నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం ఉదయం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 02 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 01,తగు న్యాయం సంబంధించిన అర్జీలు 01 స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**తొగుట ఎస్సై నవీన్**



**ప్రజా వాయిస్ తోగుట**
తొగుట కేజీబీవీలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తొగుట ఎస్సై నవీన్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయడం, సహకరించడం చట్టరీత్యా నేరమని, 2006 చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వాడుకుని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు.ఆశ్రిత జిల్లా కోఆర్డినేటర్ గణేష్ మాట్లాడుతూ, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 లేదా 100 సంఖ్యలకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎూ భాగ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది, ఆశ్రిత ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు



**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్లోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతాంగ ఉద్యమ నేత కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్తో పాటు తెలంగాణలోనూ రైతులు, వ్యవసాయ రంగ సమస్యలపై మల్లారెడ్డి నిరంతరం పోరాటాలు చేశారని నాయకులు గుర్తుచేసుకున్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల చరిత్రను అధ్యయనం చేసి వ్యవసాయ రంగాభివృద్ధిపై అనేక విశ్లేషణలు చేసిన వ్యక్తిగా అభివర్ణించారు. వర్గ పోరాటాల ద్వారానే సమాజ విముక్తి సాధ్యమని విశ్వసించిన మల్లారెడ్డి తుది శ్వాస వరకు ఎర్రజెండా భుజస్కంధాలపై మోస్తూ రైతాంగం, కార్మికులు, పేదల సమస్యలపై ఉద్యమించారని నాయకులు పేర్కొన్నారు.మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమానికి, సీపీఎం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని, ఆశయాల సాధనే నిజమైన నివాళి అని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుశల రాజన్న (రైతు సంఘం నాయకులు), ముంజం ఆనంద్ కుమార్ (వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి), పండుగ రాజేష్ (వికలాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు), మహేష్ తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజా వాయిస్ /కొడకండ్ల,(జనగామ) ఆగస్టు 24:**
కొడకండ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ అనిల్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ నాయక్తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ మార్కెట్, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ నాయక్ మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలను ఖచ్చితంగా గుర్తించి, వారికి ప్రభుత్వ ఆహార భద్రతతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా అందించడమే స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడం ద్వారా సబ్సిడీ, ఉచిత ఆహార ధాన్యాల ప్రయోజనం లభిస్తుందని తెలిపారు.కుటుంబ సభ్యులను చేర్చడం, తొలగించడం వంటి మార్పులను భవిష్యత్తులో సులభంగా చేసుకునే విధంగా డిజిటల్ వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.తహసీల్దార్ అనిల్ బాబు మాట్లాడుతూ.. కొడకండ్ల మండలంలో మొత్తం 10,823 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు.
గ్రామాల వారీగా కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి:
కొడకండ్ల - 2,725 - పాకాల - 651 రామవరం - 1,337 మొండ్రాయి - 1,650
నరసింహపురం - 377 లక్ష్మక్కపల్లి - 949-
రామన్నగూడెం - 725
రంగాపురం - 540



ఏడునూతుల - 1,181
రేగుల - 691
మొత్తం 10,823 కార్డులను స్మార్ట్ రేషన్ కార్డులుగా అందించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్, హత్య నాయక్ తండా సర్పంచ్ బొందమ్మ చందులాల్, మార్కెట్ డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 48 ఏళ్ల తర్వాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు..

**చిన్ననాటి జ్ఞాపకాలతో భావోద్వేగ సమ్మేళనం**







**దుండిగల్/ కొంపల్లి**
నలభై ఎనిమిదేళ్లు... కాలం గడిచిపోయింది. జీవిత ప్రయాణంలో ఎవరి దారిలో వారు పయనించారు. కొందరు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.. మరికొందరు వ్యాపారాల్లో రాణించారు.. ఇంకొందరు వ్యవసాయాన్ని నమ్ముకున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థాయికి తీసుకెళ్లారు. కానీ చిన్ననాటి స్నేహం మాత్రం చెదరలేదు. అలా 1977-78 విద్యా సంవత్సరంలో దుండిగల్ పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు దాదాపు 48, 49 ఏళ్ల తర్వాత సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్లో ఒకే వేదికపై కలుసుకోవడం అపురూపమైన అనుభూతిని పంచింది. ఆత్మీయ పలకరింపులు, ఒకరినొకరు చూసుకుని ఆనందపడటం, అప్పటి చిన్ననాటి అల్లరి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని నవ్వుకోవడంతో సమావేశం మొత్తం సందడిగా మారింది. తమతో పాటు చదువుకున్న 22 మంది సహచరుల్లో ఐదుగురు స్నేహితులు ఇక లేరన్న విషయాన్ని గుర్తుచేసుకుని కిషన్రావు, చక్రధర్, మైమూత్, కృష్ణ, బలరాం మృతులకు పూర్వ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి 11 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అప్పట్లో తమ తరగతిలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారిలో శ్రీనివాస్ ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎఫ్సీలో ఉద్యోగిగా సేవలందించగా, డాక్టర్ మోహన్ ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ వైద్యుడిగా సేవలందించారు. కొండల్రెడ్డి ఆర్అండ్బీ శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందారు. చదువులో అప్పట్లో వెనుకబడినప్పటికీ జీవితంలో మాత్రం ప్రతి ఒక్కరూ తమదైన రంగంలో నిలదొక్కుకోవడం పూర్వ విద్యార్థులందరికీ గర్వకారణంగా మారింది. తాము పదో తరగతి చదువులో ముందుకు సాగకపోయినా వ్యాపారాలు, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యవసాయం వంటి రంగాల్లో జీవితాన్ని కొనసాగిస్తూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా చేయడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. కొందరి పిల్లలు విదేశాల్లో స్థిరపడటం తమ జీవిత ప్రయాణానికి దక్కిన గొప్ప ఫలితమని ఆనందం వ్యక్తం చేశారు. అనివార్య కారణాల వల్ల పోలీస్ సురేందర్రెడ్డి, కుమార్గౌడ్, పద్మారావు, రామకృష్ణారెడ్డి తదితర ఐదుగురు ఈ సమావేశానికి హాజరు కాలేకపోయారు. వచ్చే సమావేశానికి వారందరూ తప్పక హాజరయ్యేలా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రవీందర్ కుమారుడు కోలా శ్రీకాంత్ (సివిల్ ఇంజనీర్), వెంకటేష్ కుమారుడు కోలా అరవింద్ (డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్) తదితరులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులను శాలువాలతో సన్మానించడం మరింత ఆనందాన్ని కలిగించింది.

**"గురువుల ఆశీర్వాదమే మా పిల్లల విజయాలకు బాట"**
సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ల తర్వాత తొలిసారిగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, "మనమంతా చదువులో అప్పట్లో కొంత వెనుకబడి ఉన్నప్పటికీ సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాం. వ్యాపారం, ఉద్యోగం, వ్యవసాయం ఇలా ఎవరి రంగంలో వారు నిలదొక్కుకున్నాం. మన పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థాయికి తీసుకెళ్లడం ఎంతో ఆనందంగా ఉంది. కొందరి పిల్లలు విదేశాల్లో ఉన్నారంటే అందుకు తల్లిదండ్రుల కృషితో పాటు తమకు చదువు చెప్పిన గురువుల ఆశీర్వాదం కూడా ఉందని మనం గుర్తించాలి" అని అన్నారు. తాను ఇప్పటికీ తన తల్లిదండ్రుల వద్దే ఉంటున్నానని ఆయన ఆత్మీయంగా చెప్పడం అందరినీ ఆకట్టుకుంది.డాక్టర్ మోహన్ మాట్లాడుతూ మనుమలు, మనుమరాళ్లకు మంచి విద్య అందించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సూచించారు. కొండల్రెడ్డి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కోరగా, సత్తిరెడ్డి పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టి వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఇంతకాలం తర్వాత అందరూ ఒకే చోట కలుసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన రవీందర్, శేఖర్, కొండల్రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ తాను మెడికల్ షాప్ నిర్వహిస్తున్నానని, ఉద్యోగాల కంటే వ్యాపారంలో స్వేచ్ఛ, అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

**ఆరు నెలలకోసారి.. మళ్లీ కలుద్దాం**
జీవితంలో వేల రూపాయలు ఖర్చు చేసినా దొరకని ఆనందం, చిన్ననాటి స్నేహితులతో గడిపే ఇలాంటి ఆత్మీయ క్షణాల్లో దొరుకుతుందని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఇకపై తామంతా సీనియర్ సిటిజన్లుగా మారుతున్న నేపథ్యంలో కనీసం ఆరు నెలలకు ఒకసారి అయినా కలుసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. ఈసారి రాలేకపోయిన వారిని తదుపరి సమావేశానికి తప్పకుండా తీసుకురావాలని నిర్ణయించారు. వచ్చే పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని తాము చదువుకున్న దుండిగల్ పరిషత్ ఉన్నత పాఠశాలలోనే నిర్వహించాలని నిర్ణయించుకోవడంతో సమావేశం మరింత భావోద్వేగంగా ముగిసింది. దశాబ్దాలు దూరం చేసినా.. జ్ఞాపకాలు మాత్రం దూరం చేయలేకపోయాయి. బాల్య స్నేహం వయసుతో తగ్గదని, కాలంతో మరింత మధురంగా మారుతుందని ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మరోసారి నిరూపించింది.

# పురుగుల మందు తాగి వ్యక్తి మృతి...

**ప్రజా వాయిస్, పాపన్నపేట**
పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగారావుపల్లి తండాలో పురుగుల మందు తాగి కేతావత్ తైర్య (32) మృతి చెందాడు. డబ్బుల విషయంలో ఈనెల 22న తల్లి భార్యతో గొడవ పడినట్లు సమాచారం, మరుసటి రోజు చెరువు కట్టపై అపస్మారక స్థితిలో కనిపించగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం నాడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ ని సన్మానించిన అనుమాండ్ల తిరుపతి రెడ్డి..

**ప్రజావాయిస్/పాలకుర్తి**
ఇటీవల యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పాలకవర్గ సభ్యులుగా నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్.లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ ని మర్యాదపూర్వకంగా సోమవారం రోజు వారి గృహం నందు కలిసి శాలువాతో సత్కరించిన తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి, వారి వెంట తొర్రూర్ మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు మేరుగు మల్లేశం గౌడ్,అనుమాండ్ల నరేందర్ రెడ్డి ఉన్నారు.

## సేవ దృక్పథంతో బాధిత కుటుంబానికి అండగాలి

**ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజా వాయిస్/రాయపర్తి**
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం శివరాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుంపల స్వరూప ఇటీవల అనారోగ్యంతో మరణించగా, ఈ రోజు వారి చిత్రపటానికి నివాళ్లు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్' తరపున 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్ ను సహాయం చేసిన..ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, ఐత రామ్ చందర్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి స్థానిక నాయకులు అయిన మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్య జగన్, మాజీ సర్పంచ్ చెడుపాక కుమార్ కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి మేకల మహేష్,లివార్డ్ నెంబర్ లు నాకీర్త అశోక్, పెందోట శివ,పార్టీ ముఖ్య నాయకులు తాళ్లపెల్లి సాయులు, సింగారపు శ్రీను, వీరాస్వామి, రామనర్సయ్య, యాకయ్య, పంగ రవి, కైతోజు సాంబయ్య, మల్లేష్, ఆనంద్, ప్రసాద్, ప్రశాంత్, అనిల్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు యూనిఫాంల పంపిణీ

**- మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



**ప్రజా వాయిస్, కోరుట్ల:**
కోరుట్ల పట్టణంలోని 4వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నూతన యూనిఫాంల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక వార్డు కౌన్సిలర్ తెడ్డు శ్రీజ విజయ్‌తో కలిసి ఆమె చిన్నారులకు నూతన యూనిఫాంలను అందజేశారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే నేడు ఉచితంగా యూనిఫాంల పంపిణీ చేపట్టామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య, వసతులు అందుతున్నాయని, తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, స్థానిక నాయకులు తెడ్డు విజయ్, అంగన్వాడీ టీచర్ శంకరమ్మ, ఆయా విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కీసరలోని సర్వే నంబర్ 329లో భూ (పానాది)వివాదం.. కలెక్టర్‌కు ఫిర్యాదు

**కబ్జాకు గురైతుందన్న మాజీ ఉపసర్పంచ్ తాటాకం లక్ష్మణ్ శర్మ**





**ప్రజావాయిస్, కీసర:**
మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని సర్వే నంబర్ 329లో భూమికి సంబంధించిన సమస్యపై కీసర మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. కీసరలోని పురాతనమైన శివాలయం మరియు పంట పొలాలకు వెళ్లే (పానాది ) 15 నుండి 20 ఫిట్ల దారి అని, అట్టి దారిని కొందరు వ్యక్తులు కబ్జాకు గురిచేస్తున్నారని అన్నారు. అయితే ఇక్కడ పానాదిపై కొందరు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసారని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే కబ్జా కోరుల నుండి పానది కాపాడి గ్రామస్థుల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వే నంబర్ 329 కి సంబంధించిన భూమి విషయంలో అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. అలాగే భూమి హద్దులు, రహదారి తదితర అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు.సోమవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రజావానిలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు . అధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కీసర మాజీ ఉపసర్పంచ్ తాటాకం లక్ష్మణ్ శర్మ కోరారు.

## రాయికల్ సీఎస్కే వెంచర్‌లో అర్ధరాత్రి దొంగల బీభత్సం

**ఇంట్లోనే బిందాస్‌గా విందు చేసుకున్న దొంగల ముఠా**

**సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**



**(ప్రజా వాయిస్ షాద్‌నగర్)**
షాద్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలోని సీఎస్కే వెంచర్‌లో విచిత్రమైన దొంగతనం ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది నక్కల యశోద అనే మహిళ తన కుమార్తె వద్దకు మహబూబ్‌నగర్ వెళ్లడాన్ని గమనించిన ముగ్గురు గుర్తుతెలియని దొంగలు అర్ధరాత్రి వేళ గడ్డపారతో ఇంటి గ్రిల్స్‌ను తొలగించి దర్జాగా లోపలికి చొరబడ్డారు ఇంట్లోకి చొరబడిన దొంగలు సుమారు రూ. 1 లక్ష నగదు, ఐఫోన్, వాచ్, విలువైన టీషర్టులు మరియు ఇంట్లో ఉన్న విదేశీ మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. మొత్తం రూ. 2 లక్షల విలువైన సొత్తు మాయమైనట్లు బాధితురాలు తెలిపింది. అయితే ఇంట్లో ఉన్న ల్యాప్‌టాప్, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను దొంగలు ముట్టుకోకపోవడం గమనార్హం.అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే దొంగతనానికి వచ్చిన ముగ్గురు దుండగులు కొంతసేపు ఇంట్లోనే గడిపి విందు చేసుకున్నారు. ఇంట్లో ఉన్న మాంసాన్ని వండుకుని తిని విదేశీ మద్యాన్ని సేవిస్తూ దర్జాగా కాలక్షేపం చేశాకే చోరీకి పాల్పడ్డారని ఆధారాలు బట్టి తెలుస్తోంది ఈ విచిత్ర చోరీ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు త్వరితగతిన నిందితులను అరెస్ట్ చేసి బాధితురాలికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


## పింఛన్ ప్రభుత్వ దానం కాదు

**వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేందుకు అందించాల్సిన బాధ్యత..**

**అర్హులైన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య, ఒంటరి మహిళ పింఛన్ల భద్రత కల్పించాలి..**

**ఎందరో వృద్ధులు, ఒంటరి మహిళలు, పింఛన్ల కోసం ఎదురుచూపులు..**


**బిజెపి 36 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అప్పం శ్రావణ్ డిమాండ్..**




**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పట్టణ పరిధిలోని వృద్ధాప్యంలో జీవనాధారం లేక అనేక మంది అర్హులైన వృద్ధులు, ఒంటరి మహిళలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి 36 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అప్పం శ్రావణ్ అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అర్హత ఉన్న పలువురికి వృద్ధాప్య పింఛన్లు అందడం లేదని, అదేవిధంగా అనేక మందికి వృద్ధాప్య, ఒంటరి మహిళల పించన్లు అలాగే ఇతర పలు పించన్లు ఆగస్టు 12 న కొత్త పింఛన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ సర్కార్ అబద్ధపు మాటలు చేసి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు పించన్లు పెంచి ఇస్తామన హామీ ఎక్కడికి పాయె అని అన్నారు. వృద్ధాప్య పింఛన్ ప్రభుత్వ దానం కాదని, వృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేందుకు అందించాల్సిన సామాజిక భద్రత అని అప్పం శ్రావణ్ పేర్కొన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వృద్ధుల కళల్లో కన్నీళ్లు కాకుండా వారి జీవితంలో భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శ్రావణ్ అన్నారు. అంతేకాకుండా అర్హులైన ప్రతి వృద్ధులకు ఒంటరి మహిళలకు, సామాజిక భద్రత కల్పించే వరకు భారతీయ జనతా పార్టీ ప్రజల తరపున తమ పోరాటాన్ని చేయడానికి ముందుకు సాగుతామని కౌన్సిలర్ అప్పం శ్రావణ్ స్పష్టం చేశారు..

## సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల సిపిఐ దిగ్భ్రాంతి

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం అఖిల భారత నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, శోకాన్ని కలిగించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర విచారానికి గురయ్యాని తెలిపారు. రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ మల్లారెడ్డి రైతు కూలీల, పేదల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప ప్రజా నాయకుడని, ఆయన మరణం కమ్యూనిస్టు రంగానికి, ముఖ్యంగా రైతు ఉద్యమానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సిపిఎం శ్రేణులకు సిపిఐ తీవ్ర సంతాపం తెలుపుతున్నదనపేర్కొన్నారు. ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన కామ్రేడ్ మల్లారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.



## అథ్లెటిక్స్‌లో ఎంజేపీ ప్రభంజనం

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్:**
సిద్దిపేట జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఎంజేపీ దౌల్తాబాద్ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి 9 పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. పోటీల్లో 4 స్వర్ణ, 3 రజత, 2 కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన ప్రవీణ్, దేవిదాస్, విష్ణు, రాఘవేంద్రలు సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.ఈ నెల 26, 27 తేదీల్లో హన్మకొండలో జరగనున్న సౌత్‌జోన్ పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ, పీఈటీలు బస్వరాజ్, డాంబులను ప్రిన్సిపాల్ స్వప్న అభినందించారు.

## వర్టూరులో మంచినీటి ప్లాంట్ ప్రారంభం: దాత సంజీవరెడ్డికి గ్రామస్తుల కృతజ్ఞతలు



**ప్రజా వాయిస్ /మోటకొండూరు:-**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని వర్టూరు గ్రామంలో శుద్ధ జలాల సమస్య తీరింది. గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీవాసుల దాహార్తిని తీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి ఫిల్టర్ ప్లాంట్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు.గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి కష్టాలను గమనించిన ఎల్లంల సంజీవరెడ్డి అనే దాత ముందుకొచ్చారు. తన సొంత నిధులతో ఎస్సీ కాలనీలో మంచినీటి ఫిల్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విరాళంగా అందించారు. ఈ జల ప్రదాత చేసిన సాయానికి వర్టూరు గ్రామస్తులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇటువంటి దాతృత్వ కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు.ఈ మంచినీటి ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టికొప్పుల సరిత మచేందర్, ఉపసర్పంచ్ మోర శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కడకంచి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి శుద్ధమైన తాగునీరు ఎంతో అవసరమని, సంజీవరెడ్డి గారి చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, వార్డు సభ్యులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన పాపన్నపేట యువకులు....

**ప్రజా వాయిస్, పాపన్నపేట**
ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు బిజెపిలో చేరుతున్నారని మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ తెలిపారు. పాపన్నపేట మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి మండల యువ మోర్చా అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో పాపన్నపేటకు చెందిన పలువురు యువకులు నర్సాపూర్ లో జిల్లా అధ్యక్షుడి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకొని బిజెపిలో చేరారు.

